
తరగతికి ఒక్కరే..!



కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఉపాధ్యాయులు లేరు. మరోచోట ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేరు. ఈ పరిస్థితి సూళ్లూరుపేట మండలంలోని కుదిరి తిప్పకండ్రిగ (కేటీ కండ్రిగ) ప్రాథమిక పాఠశాలలో ఉంది. అక్కడ కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరిలో దీక్షిత మూడో తరగతి, పద్మశ్రీ నాలుగో తరగతి చదువుతున్నారు. వీరికి ఓ ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు చేపట్టడంతోపాటు ఉపాధ్యాయ పోస్టులపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట



ఓపీ విభాగం వద్ద రోగుల బారులు

బాధలు తీర్చాలని బారులు తీరారు

తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి రోగులు పోటెత్తారు. గత వారం వర్షాల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. వీల్‌ఛైర్లకు చక్రాలు లేకపోవడంతో రోగులను వివిధ విభాగాలకు తీసుకువెళ్లే క్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రోగుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లల ఆసుపత్రి నుంచి ప్రసూతి ఆసుపత్రికి వెళ్లే మార్గంలో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఎస్సీ ఎంసీ వసతిగృహం ఎదుట వ్యర్థాలు పేరుకున్నాయి.

-ఈనాడు, తిరుపతి



ముందు చక్రాలు లేక అవస్థ

నూతన పథకానికి అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక


సక్షం.. సమగ్ర లక్ష్యం

న్యూస్‌టుడే, తిరుపతి (భవానీనగర్)

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడం వరకే అంగన్‌వాడీ కేంద్రాలను పరిమితం చేయకుండా అదనపు హంగులు కల్పించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. సక్షం అనే వినూత్న కార్యక్రమం అమలుకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకు జిల్లాలోని 475 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు.

ఉద్దేశమిలా..

ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వికాసమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో సమస్యల కారణంగా ఫలితాలు రావడం లేదు. వీటిని అధిగమించి మెరుగైన ఫలితాలు సాధించడమే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ.. సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) లక్ష్యం.



పెరటితోటల పెంపకం

ఎంపికైన కేంద్రం ఆవరణలో పోషణ వాటిక(పెరటి తోట)ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తారు. ఫలసాయం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంగా పంపిణీ చేస్తారు.

ఏర్పాట్లు ఇలా..

జిల్లాలో 2,492 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 475 కేంద్రాలను సక్షం పథకం కింద ఎంపిక చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు, కేంద్రాల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కల్పన, చిన్నారులకు బోధనతోపాటు కార్టూన్లు, బొమ్మలు, ఆటలు, పాటలు, చిట్టి కథలు తదితర వాటిని బోధించనున్నారు. ఇందుకు దృశ్య శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు సమకూర్చుతారు. శుద్ధజలం, మరుగుదొడ్లు, బల్లలు, కుర్చీలు, ఫర్నీచర్ ఏర్పాటు చేస్తారు.



చిన్నారులకు బోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

సక్షం కింద జిల్లా పరిధిలో మొదటి విడతలో 475 కేంద్రాలను ఎంపిక చేశారు. వసతులకల్పనతో పాటుగా శుద్ధజలం, పౌష్టికాహారాన్ని అందిస్తారు. ఎల్ఈడీల ద్వారా సృజనాత్మక బోధన అందుతుంది. విధుల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది.

- జయలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

జిల్లా వివరాలు

- ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 12
- కేంద్రాలు: 2,492
- గర్భిణులు: 11,336
- బాలింతలు: 12,071
- ఆరేళ్లలోపు పిల్లలు: 1,24,411

నిధుల కేటాయింపు

చిత్తూరు జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలకు రూ.81.40 లక్షలు, ఇతర సదుపాయాల కల్పనకు రూ.2,91,41,200 కేటాయించారు.

పేదల గూటికి.. కూటమి కానుక

- 2014-19 గృహనిర్మాణ బకాయిలకు త్వరలో మోక్షం
- రెండు జిల్లాల్లో రూ.86.25 కోట్ల బిల్లులు
- సర్వే పూర్తిచేసి నివేదించనున్న అధికారులు

ఈనాడు, చిత్తూరు: పేదల పక్షపాతినంటూ ఐదేళ్లు ఊరూవాడా ప్రగల్భాలు పలికిన గత ముఖ్యమంత్రి జగన్.. బడుగు, బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచారు. వారికి గత తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే వారి గోడు ఆలకించింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు తెదేపా నాయకులతో అమరావతిలో నిర్వహించిన సమావేశంలోనూ హామీ ఇచ్చారు. సిబ్బంది క్షేత్రస్థాయి సర్వే తుదిదశకు చేరిన నేపథ్యంలో త్వరలో బిల్లులు జమయ్యే అవకాశం ఉంది.

ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు..

2014-19 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం ప్రవేశపెట్టారు. కేంద్రం వాటాతో కలిపి ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు.. ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షలు చొప్పున ఇచ్చారు. ఇల్లు కట్టుకుంటే వెంటనే బిల్లులు పడతాయని అధికారులు చెప్పడంతో నిర్మాణాలకు పేదలు ముందుకు కదిలారు. జగన్ ప్రభుత్వం రాకతో కక్షపూరితంగా వ్యవహరించింది.

రెండుసార్లు తనిఖీ చేసినా

2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని అటకెక్కించింది. తొలినాళ్లలో సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకే సాయం చేస్తామని ప్రకటించింది. 2022 డిసెంబరు, 2023 జూన్‌లో రెండుసార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులకే ఇళ్లు ఇచ్చారని తేలడంతో లబ్ధిదారులకు రూపాయి జమచేసి తర్వాత ఆ ఊసే మరిచారు.

తిరుపతిలో 23,484

తిరుపతి జిల్లాలో 23,484. చిత్తూరులో 29,093 గృహాలకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. చిత్తూరు జిల్లాలోని 29,093 గృహాలకు రూ.222.10 కోట్లకుగాను 2019 నాటికి రూ.174.91 కోట్లు చెల్లించారు. తిరుపతి జిల్లాలో రూ.238.37 కోట్లలో రూ.199.31 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. రెండు జిల్లాల్లో కలిపి ఇప్పటికీ రూ.86.25 కోట్ల బకాయిలున్నాయి.

సర్వే తుదిదశకు

ఇళ్లు గతంలో ఏదశలో ఉన్నాయి? ఇప్పుడు ఏదశలో ఉన్నాయి? బ్యాంకు ఖాతా పాతదేనా? ఏమైనా మార్చారా? అని తెలుసుకునేందుకు గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందితో నెలరోజుల క్రితం యాప్‌తో సర్వే ప్రారంభించారు. చిత్తూరు జిల్లాలో సోమవారంతో ఇది పూర్తికాగా తిరుపతిలో 2,159 ఇళ్ల పరిశీలన ఒకట్రెండు రోజుల్లో ముగియనుంది. ఆ వెంటనే ఈ వివరాలు ప్రభుత్వానికి నివేదించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో సుముఖంగా ఉన్నందున త్వరలోనే బకాయిలు విడుదల కానున్నాయి.



వి.కోట మండలం పాపేపల్లిలో ఇంటి వద్ద గృహ నిర్మాణశాఖ అధికారులు

■ బైరెడ్డిపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన ఉషకు 2017లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరైంది. మూడు విడతల్లో ఆమెకు రూ.1.07 లక్షలు మంజూరైంది. రూ.43 వేల బిల్లు రావాల్సిన తరుణంలో ఎన్నికలు వచ్చాయి. వైకాపా అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు పట్టించుకోలేదు. ఇటీవల ఆమె వివరాలను అధికారులు నమోదు చేయడంతో త్వరలో బిల్లులు వస్తాయన్న ఆనందం ఆమెలో వ్యక్తమవుతోంది.

పీఎంఏవై- 2.0లో 2,149 చేర్చాలని

మరోవైపు గతంలో మంజూరై పునాది, అంతకన్నా ఎక్కువస్థాయిలో నిర్మాణం జరిగిన ఇళ్లను ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0లో చేర్చాలని భావిస్తున్నారు. చిత్తూరులో అత్యధికంగా 1,563, తిరుపతిలో 586 మొత్తంగా 2,149 గృహాలకు ఆమోదం లభించనుంది. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వ సాయమూ పెరుగుతుంది.

2014-19లో చేపట్టిన గృహ నిర్మాణాలు, సర్వే, వ్యయ వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	పరిశీలించాల్సినవి	పరిశీలించినవి	వ్యయం	చెల్లింపులు	బకాయిలు
తిరుపతి	23,484	21,325	238.37	199.31	39.06

---

24 నుంచి మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ

తిరుపతి(మహిళా వర్సిటీ): మహిళలు డిజిటల్ వ్యాపార రంగంలో మరింతగా రాణించేందుకు నైపుణ్యాల పెంపుపై శిక్షణ ఇచ్చేందుకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీ శ్రీకారం చుట్టింది. యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలెప్‌మెంట్ (యూఎన్-ఏపీసీఐసీటీ/ఈఎస్‌సీఏపీ)తో కలిసి ఈ నెల 24 నుంచి 26 వరకు విమెన్ ఐసీటీ ఫ్రాంటియర్ ఇనిషియేటివ్ (డబ్ల్యూఎఫ్ఐ)-డీఎక్స్ పేరుతో ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్(టీవోటీ) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. వివరాలను సోమవారం సావేరి సమావేశ మందిరంలో వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ వి.ఉమ విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 24 నుంచి మూడు రోజుల శిక్షణకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, హైదరాబాదుతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 70 మంది ఔత్సాహిక మహిళలు శిక్షణకు రానున్నట్లు తెలిపారు. దేశంలో శిక్షణ సంస్థగా మహిళా వర్సిటీ మాత్రమే ఎంపికైందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ రజిని, అంతర్జాతీయ సంబంధాల డీన్ విజయలక్ష్మి, పీఆర్వో శ్రీరజిని పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఉమ తదితరులు

పరిహారం రెండింతలు

వన్యప్రాణుల దాడిలో ప్రాణ, పంటనష్టాలకు పెంపు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వన్యప్రాణుల దాడిలో ప్రాణ, పంట నష్టాలకు ఇచ్చే పరిహారాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది అటవీ శాఖ జిల్లా అధికారులు పరిహారం పెంచాలని ప్రభుత్వానికి నివేదించారు. పరిశీలించిన కూటమి ప్రభుత్వం వన్యప్రాణుల దాడిలో మరణిస్తే గతంలో ఇస్తున్న రూ.5 లక్షలను రూ.10 లక్షలకు పెంచింది. గాయపడిన వారికి ఇస్తున్న రూ.75 వేలను రూ.2 లక్షలకు.. పాడి, చెరకు పంటకు ఎకరానికి ఇస్తున్న రూ.6 వేలను రూ.12 వేలకు పెంచారు. మామిడి, కొబ్బరి చెట్లకు రూ.1500 నుంచి రూ.2 వేలకు పెంచారు.



శిక్షణ పక్కాగా..

కలల కొలువు వరించేలా..!

- ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులకు డీఎస్సీ ప్రత్యేక శిక్షణ
- బోధనతోపాటు వసతి, భోజన ఏర్పాట్లు

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకుల కలల సాకారం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీ అమలులో భాగంగా ఇప్పటికే టెట్ చేపట్టగా.. త్వరలో మెగా డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. టెట్‌లో ఉత్తీర్ణత సాధించి డీఎస్సీకి సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి 5,050 మంది అభ్యర్థులకు ఆయా ప్రైవేటు సంస్థల సహకారంతో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

☛ దరఖాస్తులు ఆహ్వానించడానికి ఇప్పటికే ప్రత్యేక వెబ్‌సైట్ https:///jnanabhum-mi.ap.gov.in// అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది.

మహిళా అభ్యర్థులకు ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీన నిర్వహించే పరీక్షలో ఉత్తమ ప్రతిభకనబరిచే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశాన్ని ప్రకటించింది. నవంబర్ 2న వెలువడే టెట్ ఫలితాలు, స్క్రీనింగ్ పరీక్షలో వచ్చే మార్కులను పరిశీలించి 450 మంది మహిళా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఉచితంగా బోధన, వసతి, భోజన సదుపాయం కల్పించనున్నారు. ఇందుకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని డా.బీఆర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రాలు వేదిక కానున్నాయి. ఒక్కో కేంద్రంలో 150 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.

మొదటిసారి డీఎస్సీ అభ్యర్థులకు.. సాధారణంగా బ్యాంకింగ్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని స్టడీ సర్కిళ్లలో శిక్షణ ఇస్తుంటాం. ఈసారి మెగా డీఎస్సీ అభ్యర్థులకూ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హతగల ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- యు.చెన్నయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి



● తిరుపతికి చెందిన శివ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశాడు. ఇటీవల ధ్రువపత్రాల కోసమని కళాశాలలో సంప్రదించగా బకాయిలు చెల్లిస్తేనే ఇస్తామని యాజమాన్యం స్పష్టం చేయడంతో చేసేది లేక వెనుదిరిగాడు.

● చంద్రగిరికి చెందిన మానస ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదివింది. పోటీ పరీక్షల కోసం ధ్రువపత్రాలు కావాలని వెళ్తే, పెండింగ్ బకాయిలు చెల్లించి తీసుకెళ్లమని యాజమాన్యం చెప్పడంతో వెనుదిరిగింది.

దీవెనలంటూ.. దగా

- 39,360 మంది విద్యార్థులపై రూ.81.87 కోట్ల భారం
- చెల్లించాలంటున్న యాజమాన్యాలు
- కూటమి ప్రభుత్వంపైనే తల్లిదండ్రుల ఆశలు

ఈనాడు డిజిటల్, తిరుపతి: ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులంతా జగనన్న బాధితులుగా మిగిలారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం వారి పాలిట శాపంగా మారింది. వసతి, విద్యా దీవెనలంటూ పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించకుండానే ఎన్నికలకు వెళ్లడంతో బకాయిలు పేరుకుపోయాయి. గతంలో కళాశాలలకే ఫీజులను చెల్లించే విధానాన్ని మార్చివేసి నిధులకు కోతపెట్టడంతో డిగ్రీలు పూర్తయినా పట్టాలు చేతికందడం లేదు. తల్లిదండ్రులపై పరోక్షంగా రూ.కోట్లలో భారం పడుతోంది.

భారం ఇలా..

● 2023-24లో మూడు త్రైమాసికాల బకాయిలు ఎగ్గొట్టారు. నాలుగు విడతలుగా జమ చేయాల్సి ఉండగా, ఎన్నికలకు ముందు ఒకసారి వేసి చేతులు దులుపుకోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ ఇతర వృత్తివిద్య కోర్సులు చదివే విద్యార్థులు పెండింగ్ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు.

● 2023-24లో 39,360 మంది విద్యార్థులకుగాను రూ.81.87 కోట్ల పెండింగ్ బకాయిలు రావాల్సి ఉంది. ప్రస్తుతం పలు యాజమాన్యాలు ఫీజు బకాయిలు చెల్లించాలని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తున్నాయి.

ప్రస్తుత ప్రభుత్వమైనా విడుదల చేయాలి

గత పాలకులు బకాయిలు విడుదల చేయకుండా విద్యారంగాన్ని విస్మరించారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి.

- రవి, ఎస్ఎఫ్ఐ, తిరుపతి జిల్లా కార్యదరి

2023-24లో బకాయిల వివరాలు

కేటగిరి	విద్యార్థులు	రూ.కోట్లలో
ఎస్సీ	11,376	22.91
ఎస్టీ	1198	2.2
బీసీ	17,377	39.31
ఈబీసీ	4608	12.59
ముస్లింలు	1779	3.9
క్రైస్తవులు	110	0.25
కాపు	2920	0.71

రీసర్వే పూర్తయిన వాటిలో రిజిస్ట్రేషన్లకు అవకాశం

130 గ్రామాల్లోని రైతులకు ఊరట

ఈనాడు-తిరుపతి: రీసర్వే పూర్తయి ఎల్పీ నెంబర్లు కేటాయించిన గ్రామాల్లోని భూములకు రెవెన్యూ అధికారులు విలువను నిర్ధారించారు. 136 గ్రామాల పరిధిలోని రైతులకు ఇది ఊరట కలిగించనుంది. 'ఈనాడు' కథనానికి స్పందించిన జేసీ శుభం బన్సల్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల విలువను జేసీ నిర్ధారించారు. అయితే వీటిని రిజిస్ట్రేషన్ విభాగంలోని సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలి. ఇందుకు కొంత సమయం పడుతుందని, వచ్చేవారం నుంచి రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో మొత్తం 486 గ్రామాల పరిధిలో రీసర్వే పూర్తి చేశారు. ఈ గ్రామాల్లోని సర్వే నంబర్లకు కొత్తగా ఎల్పీ నంబర్లు కేటాయించారు. వాస్తవానికి గతంలో సర్వే నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ విలువను నిర్ధారించారు. అయితే ఎల్పీ నెంబర్లు ఇచ్చిన తర్వాత సమస్య తలెత్తింది. కొన్ని గ్రామాల్లో ఈ సమస్యను పరిష్కరించినా కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రీసర్వే ప్రక్రియను పక్కనబెట్టారు. రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. అవసరానికి భూములను అమ్ముకోలేక, తనఖా పెట్టలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై 'ఈనాడు' కథనానికి స్పందించిన జేసీ శుభం భన్సల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈనాడు కథనానికి స్పందన

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (మహిళా వర్సిటీ): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మాస్టర్ ఆఫ్ సంగీతం, కామర్స్, డిప్లమో ఇన్ సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ సంచాలకులు సువర్ణలతాదేవి తెలిపారు. అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు చరవాణి సంఖ్య 81217 87415లో సంప్రదించాలని సూచించారు.

పోలీసుల సాక్షిగా చిల్లకూరులో కవ్వింపు చర్యలు

- రోడ్డుపై వాహనాలు ఉంచి హడావుడి
- గాజు సీసాలు, పెట్రోల్ పోసి రభస

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చిల్లకూరులో ఆదివారం రాత్రి రెండువర్గాల ఘర్షణలో కొందరు అల్లరి మూకలు పోలీసుల సాక్షిగా అలజడి సృష్టించారు. మాజీ ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి ఇంటి వద్ద రెండు గంటలకు పైగా హైడ్రామా నడిచింది. ఇక్కడికి వచ్చిన తెదేపా నేత చైతన్య కృష్ణారెడ్డి కారును చుట్టిముట్టిన స్థానికులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గాజు సీసాలు రోడ్డు మీద పగలగొట్టడం, ద్విచక్ర వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టే ప్రయత్నం చేసి పోలీస్ వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈక్రమంలో సీఐ సంఘమేశ్వరరావు వాహనాన్ని కొందరు రాళ్లతో కొట్టి భయభ్రాంతులకు గురిచేయడం గమనార్హం. ఈ గొడవల్లో పునబాకకు చెందిన లోకేశ్ ఫిర్యాదు మేరకు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో పాటు 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సర్పంచి పగడాల హరిబాబురెడ్డి ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసులు నమోదు చేశారు. మొదటి ముద్దాయిగా దువ్వూరు రాకేశ్‌రెడ్డిని చేర్చారు. 'ఇవ్వాల్సిన బాకీ డబ్బులు అడిగితే రాజకీయంగా రాద్ధాంతం చేసి రంగు పూయడం ఏమిటి' అని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మండిపడ్డారు. శిరసనంబేడులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. చిల్లకూరులో ఆదివారం రాత్రి జరిగిన గొడవలు పార్టీకి సంబంధం లేదన్నారు.



వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో ఆదాయం



సత్యవేడు, న్యూస్‌టుడే: రైతులు పూల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. వీటిల్లో బంతి పూలు ముఖ్యమైనవి. మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. పండుగల సీజన్ కావడంతో రైతులు ఆదాయాలను పొందుతున్నారు. తండ్రి వ్యవసాయదారుడు కావడంతో చిన్నతనం నుంచి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు వెంకటరాజులకండ్రిగ గ్రామానికి చెందిన రుషి. అతి తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వాణిజ్య పంటలపై మక్కువ పెంచుకుని బంతిపూలను సాగు చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హోసూరు తెప్పించిన నారు మంచి దిగుబడిని ఇవ్వడంతో అధిక దిగుబడులు పొందుతున్నారు.

చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు..

ఎకరంలో బంతిపూల సాగుకు సుమారు ఆరు వేల మొక్కలు వరకు అవసరం ఉంటుంది. తెగుళ్ల, పురుగుల ఆశించకుండా మొక్కకి మొక్కకి మధ్య అడుగు, సాలుకు సాలు మధ్య రెండు అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొదట్లో వేపపిండి, 16-20-0-13 బలం ఎరువు వినియోగించారు. మొక్కలను చీడ పీడలు ఆశించకుండా మూడు రోజులకు ఒకసారి మందులు పిచికారీ చేయాలి. 20రోజుల తర్వాత డీఏపీ, మోనో క్రోటోఫాస్ వినియోగిస్తున్నారు. అప్పుడప్పుడు సేంద్రియ ఎరువులు సాళ్లలో వాడుతున్నారు.

అదును పదును చూసి సాగు

బంతి పూల సాగు లాభసాటిగా మారి ఎకరం భూమిలో కేవలం రూ.30వేల పెట్టుబడితో లక్ష వరకు ఆదాయాన్ని పొందవచ్చు. ఎకరం బంతి పూల సాగులో రెండు నుంచి మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతులు అదును పదును చూసి సాగు చేసుకుంటే సిరులు పొందవచ్చు.
- రుషి, రైతు, వెంకటరాజులకండ్రిగ, సత్యవేడు

మార్కెట్ సౌకర్యం..

బంతి నాటిన 45రోజుల నుంచి పూలు కోతకు వస్తాయి. రోజు మార్చి రోజు కోయాల్సి ఉంది. పువ్వులను ముందే నీరు అందించినట్లయితే తాజాగాను, విచ్చుకున్న పువ్వులే కోస్తే ఎక్కువ బరువు వస్తోంది. పువ్వులను తమిళనాడులోని కొయంబేడు మార్కెట్, గుమ్మిడిపూండి, మాదరపాకం, సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాలకు తరలించి అధిక లాభాలు పొందుతున్నారు.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: రబీలో వరి పంటకు ఎన్పీకే ఎంత మోతాదులో వేసుకోవాలి?
- చంద్రయ్య, రైతు, వెంకటాపురం

జవాబు: రబీ కాలంలో 48 కిలోల నత్రజని, 24 కిలోల పాస్ఫరస్, 16 కిలోల పొటాషియం, 20 కిలోల జింక్ సల్ఫేట్ ఒక ఎకరానికి ఒకేసారి వేసుకోవాలి.

రైతేరాజు

కూరగాయల పంటలు కాపాడుకుందాం



పుత్తూరు, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూరగాయల పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు ఉద్యానాధికారిణి వెంకటసౌజన్య సూచించారు.
❖ వాలిపోయిన మొక్కలను నిలబెట్టాలి. ❖ ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేసుకోవాలి. ❖ నారుకుళ్లు తెగులు ఆశించకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి నారు మళ్లను ముందుగా మందు ద్రావణంతో బాగా తడపాలి.
❖ మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములతో పాటు సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5గ్రాముల లీటరు నీటిలో కలిపి ఒకదాని తర్వాత మరొకటి వారం రోజుల వ్యవధిలో 2-3సార్లు పిచికారీ చేయాలి.
❖ వేరుకుళ్లు ఆశించిన తోటల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 20 గ్రాములు లేదా కార్బండిజిమ్ 10 గ్రాములు చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి. గొంగళి పురుగులు ఆశిస్తే నివారణకు క్లోరిపైరిపాస్ 2.5గ్రాములు లేదా నొవాల్యూరాన్ 0.15మి.లీ వంటి కీటకనాశిని మందులను లీటరు నీరు చొప్పున పిచికారీ చేస్తే అదుపు చేయవచ్చు.

పాల ధరలు పెంచుకోవడం ఇలా..



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పశుపోషకులు పాల ధరలు పెంచుకోవడంపై అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే ఆశించిన మేరకు పాల ఉత్పత్తులను పెంచుకోవడంతో పాటు ఆర్థికంగా లాభాలు పొందే అవకాశముంది.
◗ పాలల్లో వెన్న, ఘన పదార్థాల శాతం (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్) పెరగాలంటే పాడి పశువులకు రోజూ పాలకంకుల దశలో కోసిన 20 నుంచి 30 కిలోల పచ్చి మేతతో పాటు కచ్చితంగా 8 కిలోల ఎండు మేతను చిన్న ముక్కలుగా ఇవ్వాలి. ◗ ప్రతి రోజూ పాలు పితికే సమయం, వ్యక్తి, విధానం ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ◗ పశువుకు పాలు పితికే ఒక గంట ముందు నీటిని తాపరాదు. ◗ బీరు పొట్టు, పాలబడి పిండి, మొక్కజొన్న పిండి, మిగిలిపోయిన అన్నం ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆమ్ల అజీర్తి చేసి పశువులు అనారోగ్యానికి గురికావడంతో పాటు పాల ఉత్పత్తి, ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ తగ్గిపోతుంది. తద్వారా ధర తగ్గిపోయే అవకాశముంది. ◗ మేతతో పాటు రోజూ ప్రతి మూడు లీటర్ల పాలకు ఒక కిలో దాణా, పూటకు 50 గ్రాముల మినరల్ మిక్చర్ (ఖనిజ లవణ మిశ్రమం) ఇవ్వడం వల్ల ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెరుగుతుంది. ◗ పాలు పితికే సమయంలో పొదుగును సున్నితంగా రుద్దడం ద్వారా పాల దిగుబడి పెంచుకునేందుకు వీలుంటుంది. ◗ పాలను ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ తక్కువగా వచ్చే పశువులకు రోజూ వంట సోడా 120 నుంచి 240 గ్రాములు మూడు రోజుల పాటు తినిపించడం వల్ల పెంచుకునే వీలుంటుంది. ◗ పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పితికిన వెంటనే శుభ్రంగా నీటితో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ◗ పాలు పితికిన వెంటనే 15 నిమిషాల పాటు పడుకోకుండా పచ్చిదాణా తినిపించాలి. దీంతో పొదుగువాపు రాకుండా నివారించవచ్చు.

- ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, శ్రీకాళహస్తి

విన్నవిస్తున్నా పట్టించుకోరేమయ్యా..!


కలెక్టరేట్‌లో అర్జీదారుల ఆవేదన

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు వినతులిస్తున్నా న్యాయం జరగడం లేదు.. కనీసం తమ వినతులను పరిశీలించినట్లు కనిపించడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి అధికారులకు వినతులు ఇచ్చారు.




అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రహదారి స్థలం ఆక్రమించారు



పాకాల మండలం పరిధిలోని గుంత గాదంకిలో రహదారి స్థలాన్ని ఆక్రమించుకున్నారు. సర్వే నం.378/1ఈలో నాకు వ్యవసాయ భూమి ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు పొలాలకు వెళ్లే రహదారిని ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారు. అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. ప్రభుత్వం, అధికారులు మారినప్పటికీ రహదారిపై నిర్మించిన ప్రహరీని మాత్రం తొలగించలేదు. దీనివల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. **-సి.రూపకుమార్, గుంత గాందంకి**

ఇంటి స్థలంపై ఇతరులకు హక్కు



పుత్తూరు సత్యనారాయణ కాలనీలో నాకు ఇంటి స్థలం ఉంది. గత ప్రభుత్వంలో ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. కుటుంబం వీధిన పడింది. అధికారులు నా భూమిపై వారికి హక్కులు కల్పించారు. మండల రెవెన్యూ అధికారులను కలిసి విన్నవించినా న్యాయం జరగలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.
-నాగరాజు, గోవిందపాళ్యెం

● కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 193 వినతులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం భన్సల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులుతో కలిసి కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 131 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

శాంతిభద్రతలకు దిక్సూచి పోలీసులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, వేదికపై ఎస్పీ సుబ్బరాయుడు, పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: దేశ సరిహద్దుల నుంచి ఇంటి హద్దుల వరకు శాంతిభద్రతల పరిరక్షణకు దిక్సూచి పోలీసులని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ కవాతు మైదానంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అక్కడి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. జిల్లాలో అమరులైన ఎనిమిది మంది పోలీసుల కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. దేశవ్యాప్తంగా అమరులైన 216 మంది పోలీసుల పేర్లు చదువుతూ స్మరించుకున్నారు. కలెక్టర్, ఎస్పీ సుబ్బరాయుడు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

కుటుంబాలకు సన్మానం: జిల్లాలో అమరులైన ఎస్ఐ రెడ్డినాయక్, ఏఎస్ఐ యువరాజులు నాయుడు, హెచ్‌సీ చలపతిరాజు, ఇలియాస్, శ్రీధర్‌బాబు, నాగరాజ, కానిస్టేబుళ్లు విద్యాసాగర్, అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎస్పీ పరామర్శించారు.

స్పృహ తప్పిన కానిస్టేబుల్: పరేడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ అలసటకు గురై స్పృహ తప్పి పడిపోయారు. సహచరులు సపర్యలు చేస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కలెక్టర్.. కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ నాడిని పరిశీలించారు. అనంతరం పోలీసు వాహనంలో స్విమ్స్‌కు తరలించగా కోలుకుంటున్నారు.

చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో భక్తులు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన నగదు, ఇతర సొమ్ములను సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు లెక్కించారు. 116 రోజులకుగాను రూ.67,98,889 రాబడి వచ్చిందని ఈవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. యూఎస్ఏ డాలర్లు 131, యూఏఈ దిరహమ్స్ 160, సౌదీ రియాల్స్ 7, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, సింగపూర్ డాలర్ 30, ఆస్ట్రేలియా 20, కువైట్ 1/4 దీనార్, ఫేం హున్డ్రెక్రొనర్ 300, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 100, యూరో 5 వచ్చాయని ఆమె వివరించారు.



◗ ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ◗ ఎదుట జస్టిస్ వేలుమణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ◗ శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి దర్శన టికెట్ల విక్రయంపై దర్యాప్తు ముమ్మరం

తిరుమల: శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన కేసులో తిరుమల వన్‌టౌన్ పీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బెంగళూరు భక్తుడిని మోసగించిన కేసులో ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా వైకాపా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా ఎమ్మెల్సీ పీఆర్వో కృష్ణతేజ పేర్లు చేర్చిన విషయం తెలిసిందే. ఈ కేసును గోప్యంగా విచారిస్తున్న పోలీసులు గతంలో నిందితుల మధ్య లావాదేవీల వివరాలను సేకరిస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ వ్యవహారం జరుగుతుందో దానిపై దృష్టిసారించారు. ఈ వ్యవహారంలో బయట వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తితిదే ఉన్నతాధికారులు కూడా దీనిపై దృష్టిసారించారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారన్నారు. అర్హులైన వారు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ప్రిన్సిపాళ్ల ద్వారా ఈనెల 25వ తేదీ లోగా విజయవాడ, భవానీపురం, హెచ్‌బీకాలనీ, మాలవిక విల్లా, 76-1-6ఎ/1, 2 చిరునామాకు స్వయంగా లేదా పోస్టు, కొరియర్ ద్వారా దరఖాస్తులు పంపాలని ఆయన కోరారు.

అసైన్డ్ భూ దస్త్రాల పరిశీలన



దస్త్రాలు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సుజన

బాలాయపల్లి, న్యూస్‌టుడే: 2003కు ముందు ఇచ్చిన అసైన్డ్ భూములకు సంబంధించి హక్కులు కల్పించేందుకు గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన భూ వివరాలపై తుడా భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ సుజన సోమవారం పరిశీలించారు. 27 గ్రామాల్లోని 2,388 మందికి చెందిన 2,085 ఎకరాలకు భూ హక్కులు కల్పించడానికి అప్పట్లో నివేదికలు పంపారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్‌తో పాటు పలువురు సిబ్బంది గ్రామాల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరిచిన భూములకు అనుగుణంగా లబ్ధిదారుల వివరాలతో కూడిన దస్త్రాలు ఉన్నాయా? లేదా? అనే అంశంపై ఆరా తీశారు.

రాజగోపాల్‌నాయుడుకి ఘన నివాళి



రాజగోపాల్‌నాయుడుకి నివాళి అర్పిస్తున్నా గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి తదితరులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని దిగువమాఘంలోని రాజన్న మెమోరియల్ పార్క్‌లో నిర్వహించారు. అమరరాజా గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమాదేవి.. రాజగోపాల్‌నాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోపీ, మాజీ సర్పంచి కుమార్‌నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్ళపల్లి, యల్లంపల్లి సురేష్, గల్లా అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అసభ్య ప్రచారంపై కేసు

శ్రీకాళహస్తి గ్రామీణం (ఏర్పేడు), న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వం, పోలీసులపై అసభ్యకంగా ప్రచారం చేస్తున్న యువకుడిపై శ్రీకాళహస్తి గ్రామీణం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రవినాయక్ కథనం మేరకు.. తొండమనాడు ఎగువవీధికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని, పోలీసులను దూషిస్తూ అసభ్యకరంగా ప్రచారం చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సామాజిక మాధ్యమాల వేదికగా నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	142
లేయర్	115
బ్రాయిలర్స్	206
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	234
లేయర్ మాంసం	195

ఎస్వీయూ అంతర కళాశాలల క్రీడా పోటీలు



తిరుపతి బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విన్నర్ జట్టు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర జిల్లాల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియం వేదికగా మొదటి రోజు సోమవారం కబడ్డీ, తైక్వాండో పోటీలు జరిగాయి. పోటీలకు ఎస్వీయూ అనుబంధ కళాశాలలకు చెందిన 25 కళాశాలలకు చెందిన జట్లు తరలివచ్చాయి. పోటీలను ఆ వర్సిటీ వ్యాయామ విద్యావిభాగం అధిపతి ఎం.శివశంకర్ రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు ప్రారంభించారు. కబడ్డీ తుదిపోరులో తిరుపతి బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విజేతగా, తిరుపతి ఎస్వీయూ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ట్రోఫీ, ధ్రువపత్రాలను ప్రదానం చేశారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. ఆదివారం శ్రీవారిని 73,926 మంది దర్శించుకున్నారు. రూ.3.87 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

బిల్లు రీడింగ్ కాంట్రాక్ట్ అప్పగింత

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లుల రీడింగ్ కాంట్రాక్టును విజయవాడ చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సంస్థకు రెండేళ్ల కాంట్రాక్టు పద్ధతిపై విద్యుత్ బిల్లులు రీడింగ్ చేసే బాధ్యతను అప్పగించారు. వచ్చే నెల ఒకటి నుంచి ఆ సంస్థ రీడింగ్ పనులు ప్రారంభించనుంది.

హెచ్చరిక.. లెక్కచేయక

హెచ్చరికల బోర్డు పెట్టి గుర్తుచేసినా కూడా 'అయితే మాకేంటి' అన్నట్లుంది తిరుపతిలో వాహనదారుల తీరు. శ్రీనివాస సేతు మీదుగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ లోపలికి ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. ఇతర వాహనాలు ఆ మార్గంలో వెళ్తే రూ.1000 వరకు జరిమానా విధిస్తామని బారికేడ్లు పెట్టి హెచ్చరించినా ఖాతరు చేయడం లేదు. ఈ ఒక్కసారికి ఏం కాదులే అంటూ నిర్లక్ష్యంగా వెళ్తున్నారు.
- ఈనాడు డిజిటల్, తిరుపతి



జూడో రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక



క్రీడాకారులతో అధికారులు, ప్రత్యేక ఆహ్వానితులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జూడో రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల ముగింపు విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, పారిశ్రామికవేత్త జగన్నాథంనాయుడు, పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు, ఎంఈవో బాలయ్య, ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, రాష్ట్ర పరిశీలకులు ప్రతాప్‌రెడ్డి, కోచ్ గోపి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర జట్టుకు అనంతపురం నుంచి.. రాజు, దివాకర్‌రెడ్డి, మద్దుకృష్ణ, దీక్షశ్రీ, లక్ష్మారెడ్డి, యశస్విని, మౌనిక, చిత్తూరు నుంచి.. మదన్, రామాచారి, కర్నూలు నుంచి.. హిమతేజ, పురందర్, చైతన్యగౌడ, కృష్ణాజిల్లా నుంచి.. లక్ష్మణ్‌కుమార్, కీర్తన, భావన, విశాఖ పట్టణం నుంచి.. యశ్వంత్, వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి.. వెంకటలక్ష్మి, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి శ్రావణిలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తితిదే ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా గంగరాజు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా గంగరాజును నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు పలువురి బదిలీ, పదోన్నతులపై ఉత్తర్వులిచ్చారు. ఇప్పటి వరకు తితిదే ఎస్పీఎఫ్ కమాండెంట్‌గా పనిచేస్తున్న సత్యంనాయుడు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పదోన్నతిపై గంగరాజు నియమితులయ్యారు.


ఎన్నికల బరిలో 35 మంది

తిరుపతి(బైరాగిపట్టెడ): తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 35 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలారు. మొత్తం 43 మంది అభ్యర్థులు తొలుత డైరెక్టర్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిది మంది ఉపసంహరించుకోవడంతో 35 మంది మిగిలారు. వీరందరికీ ఎన్నికల అధికారి ఉమాపతి గుర్తులు కేటాయించారు. అభ్యర్థులందరూ తమ గుర్తులతో ప్రచారాన్ని తీవ్రం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

శ్రీసిటీలో వలస కార్మికుల ఘర్షణ.. ఒకరి మృతి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: తన తల్లిపై అసభ్యంగా మాట్లాడాడనే కోపంతో మద్యం మత్తులో చిన్నాన్నపై అన్నకొడుకు దాడి చేయడంతో చిన్నాన్న మృతిచెందిన ఘటన శ్రీసిటీ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బీవీ శ్రీనివాసులు కథనం మేరకు.. సత్యవేడు మండలం చెరివి గ్రామ సమీపంలో ఝార్ఖండ్ రాష్ట్రం హజారిబాగ్ జిల్లా బాత్వా గ్రామానికి చెందిన సికారి ముర్మ(39), విక్రమ్ ముర్మ శ్రీసిటీలోని బాల్ కంపెనీలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్నారు. సమీపంలోనే రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. మద్యం మత్తులో సికారి ముర్మ తన సొంత అన్న కొడుకు అయిన విక్రమ్ ముర్మతో అతని తల్లి గురించి అసభ్యంగా మాట్లాడాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న విక్రమ్ ముర్మ ఆగ్రహంతో తన చిన్నాన్నపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో సికారిముర్మ తలకు బలంగా తగలడంతో అతను అక్కడి కక్కడే మృతిచెందాడు. కార్మికుల సమాచారంతో శ్రీసిటీ సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్సై హరిప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీ కాగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

భవనం పైనుంచి పడి వలస కార్మికుడి మృతి



మృతుడు సుజిత్ కోయ్రి

రేణిగుంట, న్యూస్‌టుడే: పొట్టచేతపట్టి ఇతర రాష్ట్రం నుంచి ఇక్కడికి వచ్చిన వలస కార్మికుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... అసోం రాష్ట్రం సిబ్‌సాగర్ జిల్లా బొర్హత్ పోస్టుకు చెందిన సుజిత్ కోయ్రి(50) ఇక్కడ కూలి పనులకు వచ్చాడు. మండలంలోని కరకంబాడి పంచాయతీలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో అదనపు భవనాన్ని నిర్మిస్తున్నారు. విజయవాడకు చెందిన గుత్తేదారు ఈ పనులను చేపట్టాడు. ఇందులో భాగంగా అస్సాం రాష్ట్రం నుంచి కూలీలను ఇక్కడికి తీసుకొచ్చారని పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి నిద్రలో లేచిన సుజిత్ పొరపాటును పైనుంచి కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి
• తిరుపతి • చంద్రగిరి

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: అలిపిరి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో రెండు మ్యాన్‌హోల్స్ చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. **- సికిందర్, రామచంద్రానగర్**

సమాధానం: ఇంజనీరింగ్ అధికారుల సహకారంతో మ్యాన్‌హోల్ సమస్య పరిష్కరిస్తాం. **- యువ అన్వేష్, ఎంహెచ్‌వో**

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే:

సమస్య: వేదాంతపురం పంచాయతీ విద్యుత్తునగర్‌లో పందుల సంచారం అధికంగా ఉంది. ఇళ్ల వద్దకు వచ్చి గుంతలు తీసి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. **- రమణ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి పందుల యజమానులకు సూచనలు చేస్తాం. **-ఎం.మునీశ్వరి, కార్యదర్శి**

చెత్త దిబ్బల తొలగింపు

స్పందనకు వందనం

తిరుపతి(నగరపాలిక): మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన సోమవారం దొడ్డాపురం వీధి నుంచి రాములవారి గుడికి వెళ్లే సందులో ఖాళీ స్థలంలో ఉన్న చెత్త దిబ్బ గురించి వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు చెత్త దిబ్బల్ని తొలగించి తరలించారు.


మాధురి

బాధ్యతల స్వీకరణ

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి గ్రామీణ మండలం ఈవోపీఆర్డీగా పని చేస్తున్న ఆమెకు తిరుచానూరు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు.

స్తంభాన్ని సరిచేశారు

ఈనాడు కథనాలకు స్పందన

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: 'వాలిన విద్యుత్తు స్తంభం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో వచ్చిన వార్తకు విద్యుత్తు శాఖ ఏఈ గిరి స్పందించారు. నడవలూరుకు వెళ్లే మార్గంలో పొలాల్లో స్తంభాన్ని సరి చేశారు.

బస్టాండులో అంతరాయం లేకుండా చర్యలు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: తిరుపతి కేంద్రీయ బస్టాండ్‌లో వర్షపునీరు నిలవకుండా, ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం 'ఏడుకొండల దారిలో ఇదేమి పరీక్ష గోవిందా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన ఈ మేరకు స్పందించారు.

ఆరడుగుల నేలకు అవస్థలు

శ్మశానవాటిక లేక ఇబ్బందులు

చంద్రగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో శ్మశానవాటికలు కనుమరుగైపోతున్నాయి. చంద్రగిరి శ్మశానవాటికలో వ్యర్థాలు, చెత్త వేయడంతో మరుభూమి కుచించుకుపోతోంది. మృతదేహాన్ని ప్రశాంతంగా ఖననం చేయాలంటే కొన్ని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

❖ ఇటీవల పిచ్చినాయుడుపల్లి హరిజనవాడ, కాశిపెంట్ల దళితవాడ, మామండూరు ఎస్సీ కాలనీల్లో అంత్యక్రియల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు బంధుమిత్రులు ఎదురుచూశారు. రెవెన్యూ అధికారుల చొరవతో తాత్కాలికంగా పరిష్కార మార్గం చూపించారు. నియోజకవర్గంలో శ్మశానవాటిక లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. పాకాల మండలంలో సుమారు 190 పైగా గ్రామాలకు ఇప్పటి వరకు శాశ్వత శ్మశానవాటికలు లేవు. ఎవరైనా చనిపోతే చెరువులు, కుంటల్లోనే అంతిమ సంస్కారాలు చేయాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం చూపలేదు.

❖ పూతలపట్టు-నాయుడుపేట ఆరు వరసల జాతీయ మార్గం విస్తరణలో మండలంలోని పాకాలవారిపల్లి, పనపాకం, కాశిపెంట్ల, కల్‌రోడ్డుపల్లి, మామండూరు ఎస్సీ కాలనీ, వెంకటంపేట, రాయలపురం గ్రామాలకు చెందిన శ్మశానవాటికలు కనుమరుగయ్యాయి. సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామాలకు శాశ్వత శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


శ్మశానవాటికలో చెత్త కుప్పలు

వర్మీకంపోస్ట్ వాడకంతో ప్రయోజనాలు

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రకృతి సహజంగా తయారైన వర్మీకంపోస్ట్ వాడకం వల్ల మొక్కల పెంపకంలో అనేక ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్ట్ అమ్మకాలను ఆయన ప్రారంభించారు.

నగరపాలికకు 32 వినతులు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం నగరపాలిక కార్యాలయంలో వైద్యాధికారి డా.యువ అన్వేష్ ప్రజల నుంచి 32 వినతులు స్వీకరించారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు వ్యవసాయంలో సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది చిత్తూరు జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త బి.సంధ్యారాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు వి.సుమతి, శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.వి.రమణ ప్రారంభించారు. శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 66 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని అదనపు ఎస్పీ వెంకట్రావు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 66 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుని సమస్య గురించి ఆరా తీశారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు.

ఆలయ సమీపంలో వెళ్లిన హెలికాప్టర్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయానికి సమీపంలో సోమవారం ఉదయం ఓ హెలికాప్టర్ వెళ్లింది.

డాక్టరేట్ ప్రదానం


స్వాతి

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని ఆర్.స్వాతికి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

అభిషేక పూజలు

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలకోన సిద్ధేశ్వరస్వామివారికి సోమవారం విశేష అభిషేక అలంకరణ సేవలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూలమూర్తులతో పాటు సపరివార దేవతా మూర్తులకు అభిషేకం, అలంకరణ సేవలను ఆలయ ప్రధాన అర్చకులు శివప్రసన్నశర్మ సహచర అర్చక బృందంతో కలిసి శైవాఘమోక్తంగా నిర్వహించారు.


కలెక్టరేట్ ఎదుట పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు

సచివాలయ సిబ్బందిని పంచాయతీలకు అనుసంధానం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బందిని గ్రామ పంచాయతీలకు అనుసంధానం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం భన్సల్‌ను కలిసి పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శ్రీలక్ష్మి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి తెలిపారు.

ఉపాధ్యాయ శిక్షణ

తిరుపతి(మంగళం),న్యూస్‌టుడే: మంగళం సమీపంలోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సోమవారం కృత్రిమ మేధపై ఆరు రోజుల అటల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఐసీటీఈ-ట్రైనింగ్, లెర్నింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎన్ఐటీ వరంగల్ ప్రతినిధి డాక్టర్ ఆర్.బి.వి.సుబ్రహ్మణ్యం ప్రారంభించి, అధ్యాపకులకు, విద్యార్థులకు సూచనలు చేశారు.


పోటీలో పాల్గొన్న అకడమిక్ హైట్స్ విద్యార్థులు



బహుమతులందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

మేధస్సుకు పదును.. విద్యలో రాణింపు

తిరుపతి(బైరాగిపట్టెడ) న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి తన మేధస్సుకు పదును పెడుతూ విద్యలో రాణించాలని అకడమిక్ హైట్స్ స్కూల్ డైరెక్టర్ ఎం.హిమసాగర్‌కృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో టి.చేతన, ఎన్.స్వేచ్ఛ, బి.శ్రీవాత్సవ్ విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంశాపత్రాలను ఎం.హిమసాగర్ కృష్ణ, ప్రిన్స్‌పల్ మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు.





పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ❖ అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

అమరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించి అమరులైన వీరుల త్యాగాలు స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యాన్ని నిర్వర్తించాలని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచించారు. కపిలతీర్థంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించారు. ప్రాంగణంలోని అమరవీరుల స్థూపానికి ఆయనతోపాటు అధికారులు, సిబ్బంది గౌరవ వందనం చేసి, నివాళులర్పించారు. డీఎస్పీ బాలిరెడ్డి, ఆర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కృపానంద, సీఐ సురేష్‌కుమార్, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

కల్యాణి డ్యామ్ పీటీసీలో.. చంద్రగిరి గ్రామీణ: అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కల్యాణి డ్యాం పోలీసు శిక్షణ కళాశాలలో నిర్వహించారు. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు అసువులు బాసిన పోలీసు అమరవీరులకు ప్రిన్సిపల్ కె.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన వారి సిబ్బంది పరేడ్ గ్రౌండ్లో నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ వి.శ్రీనివాసులు, హెచ్.ఎల్.ఐ రాజగోపాల్‌రెడ్డి, డీఎస్పీలు, సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపాకు కార్యకర్తలే కొండంత బలం

చంద్రగిరి, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరిలోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో సోమవారం మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సభ్యత్వ సమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లక్ష్యానికి మించి చేపట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటిల రాజకీయాలపై ఆయన మండిపడ్డారు. తనపై, తన కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తున్న పేటీఎం బ్యాచ్ వాటిని నిరూపించగలరా అంటూ సవాలు చేశారు. తెదేపా సీనియర్ నాయకులు శివకోటేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, శ్రీధర్‌నాయుడు, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, చిరంజీవి పాల్గొన్నారు. **చంద్రగిరి :** రాష్ట్రంలో నిరుపేదలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందుతున్న రోగులు ఆకలితో అలమటించరాదన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా రూ.5లకే అన్నాక్యాంటీన్లు ప్రారంభించిందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరిలోని 50 పడకల సామాజిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రోగులకు ఉచిత భోజన వసతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, చిత్రంలో ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ తదితరులు

రికార్డు స్థాయిలో తెదేపా సభ్యత్వ నమోదు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం రికార్డు స్థాయిలో ఉండేలా పార్టీ నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఆమె నివాసం వద్ద సభ్యత్వ నమోదుపై పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు చిట్టిబాబు, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

తలకోనలో సర్దార్-2 చిత్రీకరణ

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తలకోనలో తమిళ సినీనటుడు కార్తి నటిస్తున్న సర్దార్-2ను చిత్రీకరిస్తున్నారు. మరో నాలుగురోజుల పాటు షూటింగ్ కొనసాగిస్తామని యూనిట్ బృందం వివరించింది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాకాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) నాయకుడు, సీఐటీయూ నేత ఇ.మధుసూదన్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఎంఈవో బాబ్జిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి

క్రైం కార్నర్

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక రైల్వే స్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫాం వద్ద గుర్తుతెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు పరిశీలించగా మందుల చీటీలో అతని పేరు శ్రీనివాసులుగా గుర్తించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

కారులో మంటలు.. ప్రయాణికులు సురక్షితం

చంద్రగిరి, న్యూస్‌టుడే: తొండవాడ సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రెప్పపాటులో జరగబోయే ప్రమాదాన్ని గుర్తించిన వాహనంలోని ఐదుగురు పర్యాటకులు కారు దిగి ప్రాణాలను దక్కించుకున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో గోల్డెన్ టెంపుల్‌కు వెళ్లి తిరుపతికి వస్తుండగా ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది.

ఎర్రచందనం స్వాధీనం

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆదివారం రాత్రి కడప జిల్లా పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. కడప జిల్లా సి.కె.దిన్నె మండలం మద్దిమడుగు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం తరలించడానికి ప్రయత్నిస్తున్న స్మగ్లర్లపై దాడులు నిర్వహించారు. తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు.

బ్యాటరీల దొంగ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: రిలయన్స్ జియో పవర్ బ్యాటరీలు కాజేసిన దొంగను అరెస్టు చేసినట్లు తిరుపతి పడమర ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. బాలాజీ కాలనీలోని ఆదిత్య టవర్స్ అపార్ట్‌మెంట్‌పై ఉన్న రిలయన్స్ జియో టెలికామ్ నెట్‌వర్క్ కంపెనీకి చెందిన పవర్ బ్యాటరీలు చోరీకి గురైనట్లు టెక్నీషియన్ నరసింహులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సోమవారం స్థానిక రామచంద్ర పుష్కరిణి వద్ద అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చింతకాయల వీధికి చెందిన హేమంత్ కుమార్‌గా గుర్తించారు. అతని నుంచి రూ.70 వేలు విలువైన 5 పవర్ బ్యాటరీలు, నేరానికి ఉపయోగించిన రెండు స్పానర్లు, చరవాణి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: పవర్ లూమ్ దుకాణం ఖాళీ చేయించే క్రమంలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు. హిందుపురానికి చెందిన యశోద స్థానిక గాంధీపురం మెయిన్‌రోడ్డులోని రాజేశ్వరరావుకు చెందిన స్థలాన్ని 2022లో రెండేళ్ల లీజు ప్రాతిపదికన తీసుకున్నారు. ఆ స్థలంలో పవర్ లూమ్ పెట్టి చీరలు తయారు చేసి విక్రయించేవారు. ఈ నేపథ్యంలో స్థలం యజమాని రాజేశ్వరరావు సుమారు వంద మందితో వచ్చి ఉన్నపలంగా స్థలాన్ని ఖాళీ చేయించారని, సుమారు రూ.50 లక్షల వస్తువులు ధ్వంసం చేశారని యశోద ఫిర్యాదు చేశారు. అదే సమయంలో యశోద అద్దె ఇవ్వకుండా.. స్థలాన్ని ఖాళీ చేయకుండా నోటీసులు పంపి వేధిస్తున్నారని, అడిగితే దౌర్జన్యానికి పాల్పడ్డారని రాజేశ్వరరావు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మార్కెట్లోకి బజాజ్ 'ఫ్రీడమ్'

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: కాలుష్య రహిత వాహనాలను అందించడంలో భాగంగా బజాజ్ కంపెనీ సీఎన్జీ, పెట్రోల్‌తో కూడిన బజాజ్ ఫ్రీడమ్ ద్విచక్ర వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని శ్రీరామ్ బజాజ్ షోరూంలో సోమవారం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. నూతనంగా కొనుగోలు చేసిన వినియోగదారులకు తాళాలు, బహుమతులను అందజేశారు. సంస్థ మేనేజింగ్ పార్టనర్ శ్రీనివాసరావు, షోరూం అధినేత సాకేత్ రామ్, అభినవ్ రామ్, సీఎన్జీ సంస్థ ప్రతినిధులు గౌతమ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వాహన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని, షోరూం అధినేతలు

మెరుగైన పరిశోధనలతో వ్యాధి నిర్ధారణ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: వ్యాధి నిర్ధారణ మెరుగైన పరిశోధనలతోనే సాధ్యమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు పేర్కొన్నారు. పరిశోధనలపై రెండు రోజుల కార్యశాలను సోమవారం ఎస్వీఎంసీలో ప్రారంభించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏఎస్ కిరీటి, ఎంఆర్‌యూ శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన, డాక్టర్ రేఖా పాల్గొన్నారు.

టెట్ అభ్యర్థులకు చుక్కలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: టెట్ పరీక్ష చివరి రోజైన సోమవారం అభ్యర్థులు పలు ఇబ్బందులు పడ్డారు. జూపార్క్ రోడ్డులోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో సోషల్ మెథడాలజీకి సంబంధించిన పరీక్ష జరిగింది. కేంద్రంలో సెల్‌ఫోన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో గంట నుంచి గంటన్నర సమయం వృథా అయ్యిందని, సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్లు అభ్యర్థులు వాపోయారు. చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

వ్యాయామంతో ఆరోగ్యం

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: క్రమం తప్పని వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డాక్టర్ వెంకయ్యబాబు పేర్కొన్నారు. నగరంలోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో సోమవారం రాస్ పొదుపు సంఘాల సారథ్యంలో స్వీకార్, టాటా క్యాన్సర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు.

జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జ్యోతిష్య, వాస్తు విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభమైంది. 25 మందికి పైగా పంచాంగ కర్తలతో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెంట్రల్ సాంస్కృతిక యూనివర్సిటీ, దేవప్రయాగ క్యాంపస్ డైరెక్టర్ ప్రొ.పి.వి.బి సుబ్రహ్మణ్యం, విశ్వవిద్యాలయ వైస్-ఛాన్స్‌లర్ ప్రొ.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

ముక్కంటి సేవలో పిడుగు హరిప్రసాద్

శ్రీకాళహస్తి: ఎమ్మెల్సీ సభ్యులు పిడుగు హరిప్రసాద్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఈయనకు సోమవారం జనసేన నియోజక వర్గ సమన్వయకర్త వినుత దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొట్టే సాయి, అంజూరుచక్రధర్, నేతలు పాల్గొన్నారు.

నేడు ఆధార్ శిబిరం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలోని అక్షర జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలాజీనాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ నమోదు, సవరణలకు సంబంధించిన సమస్యలకు శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

'గౌడ సంక్షేమ సంఘాన్ని రద్దుచేసే అధికారం లేదు'

శ్రీకాళహస్తి: గౌడ సంక్షేమ సంఘాన్ని 222/2019లో రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందని, దీన్ని రద్దు చేసే అధికారం నూతనంగా వస్తున్న సంఘాలకు లేదని గౌడ సంక్షేమ సంఘం నేతలు స్పష్టం చేశారు. కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన విమర్శలపై సోమవారం గౌతులచ్చన్న విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం జిల్లా నేతలు రాజశేఖర్, నారాయణస్వామి, చంద్రశేఖర్, ఆనంద్, బత్తెయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో సత్తా

శ్రీకాళహస్తి: పట్టణంలోని లిటిల్ మాస్టర్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ పోటీల్లో సత్తాను చాటినట్లు ఇన్‌స్టిట్యూట్ ఎండీ దివ్య తెలిపారు. వివిధ స్థాయిలో సత్తాను చాటడం ఆనందంగా ఉందని తెలిపారు.

న్యాయం చేయండి సారూ



కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌కు విన్నవించుకుంటున్న చిందేపల్లి గ్రామస్థులు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: మా గ్రామానికి వెళ్లే రోడ్డు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని ఏర్పేడు మండలంలోని చిందేపల్లి ప్రజలు కలెక్టర్ డా. వెంకటేశ్వర్‌కు విన్నవించుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారి నుంచి దశాబ్దాలుగా మా గ్రామానికి రహదారి అందుబాటులో ఉందన్నారు. అయితే గతంలో వైకాపా నేతల అండదండలతో రాచగున్నేరి సమీపంలోని పరిశ్రమ ప్రతినిధులు గ్రామానికి వెళ్లే రోడ్డును ఆక్రమించుకుని వేరేదారిని ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రహదారిని సైతం ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేయడంమే కాకుండా గ్రామానికి చెందిన కార్మికులను తొలగించేందుకు పరిశ్రమ అధికారులు చర్యలు చేపట్టారని వాపోయారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మా గ్రామానికి న్యాయం చేయాలని కోరారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఆయన వినతులు స్వీకరించారు. పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల్లో అధిక భాగం భూ సమస్యలేనని, ఇవన్నీ మాజీ ఎమ్మెల్యే పాపాలని ఈ సందర్భంగా విమర్శించారు. తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఎంపీడీవో సురేంద్రనాథ్, నేతలు గాలి మురళినాయుడు, మునిరాజానాయుడు, జయచంద్రనాయుడు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

● గ్రామీణాభివృద్ధి తెదేపా ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సాంబయ్యపాలెం పంచాయతీలో సోమవారం రూ. 20 లక్షల నిధులతో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని శంకుస్థాపన చేశారు. మురళినాయుడు, జయచంద్రనాయుడు, మనిరాజానాయుడు పాల్గొన్నారు.

● **శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** తెదేపా సభ్యత్వ నమోదును పార్టీ శ్రేణులు పోటాపోటీగా చేపట్టాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవనంలో సోమవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం అయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా ఎక్కువ మంది సభ్యత్వం తీసుకోనున్నారని, ఆయా మండల ముఖ్య నేతలు ప్రత్యేక దృష్టి సారించి వీలైనంత ఎక్కువగా సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు.

ఆదిమూలంపై సస్పెన్షన్‌ను రద్దు చేయాలని వినతి



మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుతో మాట్లాడుతున్న నాగలాపురం తెదేపా నేతలు

నాగలాపురం, న్యూస్‌టుడే: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తెదేపా విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబులను నియోజకవర్గంలోని పలువురు తెదేపా నేతలు కోరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయం, సచివాలయాల వద్ద సత్యవేడు నేతలు అగ్రనేతలను కలిసి వినతి పత్రాలను అందించారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌తో చరవాణిలో సమస్యను విన్నవించారు. సత్యవేడులో తెదేపాకు పెద్దదిక్కుగా ఉన్న ఎమ్మెల్యేపై నిరాధారమైన లైంగిక వేధింపులను కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో తిరిగి ఆదిమూలాన్ని పార్టీలోకి తీసుకోవాలని కోరారు. తమ వినతులకు అగ్రనేతలు సానుకూలంగా స్పందించారని నేతలు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన పరిశీలన

శ్రీకాళహస్తి : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన మధ్యాహ్న భోజనం నాణ్యతను న్యాయవాదులు పరిశీలించారు. జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని బాబుఅగ్రహారం, బాలికోన్నత పాఠశాలల్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి అక్కడున్న సమస్యలను తెలుసుకున్నారు. వీటిని నివేదిక రూపంలో జిల్లా న్యాయమూర్తికి పంపనున్నట్లు న్యాయవాదులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, రజని, ప్రజ్ఞశ్రీలు తెలిపారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న న్యాయవాదులు



పొట్టేలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యులు శ్రీకాంత్‌బాబు

నట్టల నివారణతో రోగాల నియంత్రణ

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: నట్టల నివారణతోనే పశువుల్లో రోగాలను నియంత్రించవచ్చునని శ్రీకాళహస్తి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.ఎన్.వి.శ్రీకాంత్‌బాబు తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో సోమవారం గొర్రెలు, మేకల్లో సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవార్మింగ్ మందులు తాగించడంతో జీవాల్లో నట్టలు నిర్మూలించి రక్తహీనతను తొలగించవచ్చునని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో 87461 జీవాలకు మందులు పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టామన్నారు. రవీంద్రవర్మ, జనార్థన్, వెంకటేష్, యూసఫ్, అబ్దుల్ పాల్గొన్నారు.

● పంతాలు.. పట్టింపులు
● అధికారులకు తప్పని శిరోభారం



అన్నక్యాంటీన్ పక్కన నిర్వహిస్తూ వచ్చిన మద్య దుకాణం

వద్దంటే వినరే..!

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలు దక్కించుకునే వరకు నువ్వానేనానంటూ పోటీ పడ్డ నేతలు ఇప్పుడు దుకాణాల ఏర్పాటుకు అదే రీతిలో సన్నాహాలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆ స్థాయిలో పోటీలు లేకున్నా పట్టణ ప్రాంతంలో మాత్రం పోటీ తీవ్రతరంగా మారుతోంది. స్థానిక, స్థానికేతరుల మధ్య ప్రస్తుతం దుకాణాల ఏర్పాటు విషయంలో పోటీలు పడుతుండటం ఎక్సైజ్ శాఖ అధికారులకు శిరోభారంగా మారింది. శ్రీకాళహస్తి ఎక్సైజ్ పరిధికి సంబంధించి 30 దుకాణాలకు టెండర్ల ద్వారా అప్పగించడం పూర్తయింది. వీటిల్లో 12 దుకాణాలు శ్రీకాళహస్తి పరిధికి సంబంధించినవే. మిగిలిన మండలాల్లో పెద్దగా ఇబ్బందులు లేకున్నా ఇక్కడ మాత్రం స్థానిక.. స్థానికేతరుల మధ్య పంతాలు.. పట్టింపులకు ఆస్కారం ఏర్పడుతోంది.

అభ్యంతరాలపై అధ్యయనం

ప్రజల నుంచి తమకు వచ్చిన అభ్యంతరాలపై పూర్తిగా అధ్యయనం చేస్తున్నాం. గతంలో ఉన్న దుకాణాలు అలాగే ఉంచాలా..? ఎద్దైనా మార్పులు చేయాలా అన్న విషయమై ఇంకనూ నిర్ణయం తీసుకోలేదు. శాశ్వత లైసెన్సు ఇచ్చిన చోట మాత్రమే దుకాణదారులు దుకాణాలు కొనసాగించాల్సి ఉంటుంది. **- లావణ్య, ఎక్సైజ్ వలయాధికారిణి, శ్రీకాళహస్తి**

అభ్యంతరాలకు ఆమోదించేనా

మద్యం దుకాణాల టెండర్ల నిర్వహణ తరువాత దుకాణాల కేటాయింపు విషయంలో అభ్యంతరాలపై అధికారులు అధ్యయనం చేసి అక్కడున్న పరిస్థితులను పూర్తిగా తెలుసుకుని దుకాణం ఏర్పాటు చేయాలా.. వద్దా అన్న విషయమై నిర్ణయం తీసుకుని శాశ్వత లైసెన్సు అందజేయడం జరుగుతుంది. అప్పుడే అక్కడ దుకాణాన్ని కొనసాగించుకునే అవకాశం లభిస్తుంది. ఉదాహరణకు పట్టణంలోని రామసేతు కూడలి వద్ద వైకాపా అయిదేళ్లల్లో ప్రభుత్వ దుకాణాన్ని కొనసాగించారు. అయితే ప్రస్తుతం అన్న క్యాంటీన్ ఏర్పాటు కావడం, ముక్కంటి దర్శనార్థం తిరుపతి నుంచి వచ్చే భక్తులందరూ ఇక్కడే దిగుతుంటారు. ఈ పరిస్థితుల్లో అక్కడ మద్యం దుకాణం వద్దని ఓ వర్గం చెప్తుంటే.. వారి ప్రత్యర్థి వర్గం అక్కడే ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేయడం చర్చనీయాంశంగా మారుతోంది. అలాగే పొన్నాలమ్మ ఆలయం, బలరాం థియేటర్, బంగారమ్మ కాలనీ ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. పంతాలకు వెళ్లి దుకాణదారులు వాళ్ల ఇష్టానుసారం ఏర్పాటు చేస్తారా..? నిర్దేశించిన స్థానాల్లో ఏర్పాటు చేస్తారా..? ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చిన దృష్ట్యా ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తారా అన్నది వేచిచూడాల్సిందే.

ప్రతిభకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని శ్రీభాష్యం ఇంగ్లిషు మీడియం పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్‌నెట్ వాడకం వల్ల లాభాలు-నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు చిన్మయి, సాయిసాత్విక, మెహత్‌గౌడ్‌లకు పాఠశాల వైస్ ప్రిన్సిపల్ దివ్య ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌ఛార్జి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయిని రమాశైలజ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ దివ్య తదితరులు



పోటీల్లో పాల్గొన్న భాష్యం ఇంగ్లిషు మీడియం పాఠశాల విద్యార్థులు

ఉపాధ్యాయురాలికి అవార్డు

నాగలాపురం : పిచ్చాటూరు ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మల్లీశ్వరిని తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఆదివారం వే ఫౌండేషన్ సంస్థ జీవితకాల సాఫల్య అవార్డుతో సన్మానించింది. ఉద్యోగ బాధ్యతలతో పాటు తిరుమలలో ఉద్యోగులు, వాలంటీర్లు, పాఠశాల సమీప గ్రామాల్లోని ప్రజలకు ధ్యానంపై ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు శాఖాహార ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేస్తూ సమాజ అభ్యున్నతికి సేవ చేసినందుకు ఆమెను అభినందించారు.



మల్లీశ్వరికి అవార్డును అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

నైతిక విలువల పెంపునకు కృషి చేయండి .. నాగలాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు పాఠశాలలో బోధనాభ్యసనతో పాటు నైతిక విలువల పెంపుపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈవో హేమమాలిని సూచించారు. పిచ్చాటూరు ఎమ్మార్సీ ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యం పాఠశాలకు సంబంధించిన యాప్‌లలో మరుగుదొడ్ల ఫొటోలు, మధ్యాహ్న భోజన ఫొటోలను పొందుపరచాలన్నారు. ప్రశస్త యాప్‌లో ప్రతి పాఠశాలను వీరగాథల చిత్రాలు నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు హాజరుపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో2 యుగంధరరాజు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. రాజయ్య, మణి, రమణయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

మండలాన్ని ఏ గ్రేడింగ్‌లో నిలపాలి .. సత్యవేడు, న్యూస్‌టుడే: వివిధ ఆహార ఉత్పత్తులు తయారు చేయడానికి స్వయం సహాయక సంఘాలకు అన్ని రకాలు సదుపాయాలు కల్పిస్తామని ఏపీఎం డా. డాంగే యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో సంఘమిత్రలతో సమావేశం ఏర్పాటు చేశారు. వెలుగు కో-ఆర్డినేటర్ పయని, మండల మహిళా సమైక్య కార్యదర్శి మంజుల, అకౌంటెంట్ కాంచన, సంఘ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ.. ఏర్పేడు, న్యూస్‌టుడే: సాహసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని పాతవీరాపురంతో పాటు పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం విద్యాసామాగ్రి వితరణగా అందజేశారు. కార్యక్రమానికి ఎంఈవో ప్రేమలత ముఖ్యఅతిథిగా హాజరై దాతలు అందజేసిన బ్యాగులు, రాతపుస్తకాలు, పెన్‌లు వంటి సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. శివకోటి, దవీణ్ బాబు, లక్ష్మి, భువనేశ్వరి, పద్మజ, వెంకటేశ్వర్లు, దేవరాజులు, ఉషారాణి, శ్రీహరి పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా మహ్మద్ అక్రమ్.. వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత హౌసింగ్ కార్యాలయానికి నూతన ఏఈని నియమించారు. నూతన ఏఈగా సూళ్లూరుపేట నుంచి బదిలీ అయిన మహ్మద్ అక్రమ్ సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల కిందట ఇక్కడ ఏఈగా పని చేస్తున్న రాఘవయ్య పదవీ విరమణ చెందడంతో, నాటి నుంచి బీఎన్‌కండ్రిగ, తడ మండలాలకు చెందిన ఏఈలు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించారు.



గోప్యంగా సామాజిక తనిఖీ.. సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని 28 పంచాయతీల్లో ఈ నెల 10వ తేదీ నుంచి ఉపాధి హామీ పథకం సంబంధించి అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని కొత్తమారికుప్పం, అంబాక్కం పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీలకు తెలియకుండా కొంతమందికి అనుకూలంగా గోప్యంగా అధికారులు తనిఖీ చేపట్టడం దుర్మార్గమని స్థానికులు వాపోతున్నారు. మస్టర్‌లో కూలీల సంతకాలు లేకుండా 842 క్యూబిక్ మీటర్లకు పనులు జరగకుండానే సుమారు రూ.లక్షా ఎనభైవేలు అదనంగా కూలీకి రాని కూలీల ఖాతలకు మళ్లించి వారి దగ్గర వసూలకు పాల్పడినట్లు అంబాక్కం పంచాయతీలో జరిగినట్లు తెలుస్తోదన్నారు. వారానికి ఆరు రోజుల పాటు పనిచేసినా కేవలం రెండు, మూడు రోజులకు మాత్రమే బిల్లులు పడుతున్నాయని, మిగతా మూడు రోజులు కూలీల డబ్బులను వేరే ఖాతాలకు టెక్నికల్ అసిసెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు మళ్లిస్తున్నారని ఆరోపించారు. పనులు చేసిన తమ డబ్బులను వేరే ఖాతాలకు మళ్లించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సామాజిక తనిఖీ పటిష్ఠతకు చర్యలు చేపట్టాలని కోరతున్నారు.

ప్రమాదకర చెట్టు తొలగింపు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా భరద్వాజతీర్థం వద్ద కుప్పకూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్టును ఎట్టకేలకు తొలగించారు. ప్రమాదకరంగా ఉన్న చెట్టు విషయమై 'ఎండిన వృక్షం పడితే కష్టం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సూచనల మేరకు ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రమాదకర వృక్షాన్ని జేసీబీల సాయంతో తొలగించారు.

ఆకట్టుకుంటున్న అందాలు

పచ్చనిచెట్ల నడుమ కొండలపై నుంచి సహజంగా జాలువారే సింగిరికోన జలపాతం అందాలు పర్యాటకులను కట్టి పడేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నారాయణవనం మండలంలోని సింగిరి కోన జలపాతం కొండలపై నుంచి చెట్ల నడుమ కొనేరులో దుముకుతూ కనువిందు చేస్తూ ఉండడంతో చిన్నారులతో పాటు పెద్దలు సైతం జలపాతంలో కేరింతలు కొడుతూ మునుగుతూ సంతోషంగా గడుపుతున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణవనం





జాతీయ రహదారిపై నీటి గుంతలు

రేణిగుంట, న్యూస్‌టుడే: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదంగా మారాయి. రేణిగుంట జ్యోతినగర్ వెనుక భాగంలోని మార్గంలో రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడింది. దీంతో అక్కడ వర్షపు నీరు చేరి తెలియడం లేదు. ఆ గుంతలపై నుంచి వాహనాలు వెళ్తుంటే అందులో దిగడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం గుంతలను పూడ్చి వేయని స్థితిలో అధికారులు ఉన్నారు.

ఎట్టకేలకు..!

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన టాయ్‌లెట్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సువర్ణముఖి నదీ తీరంలో నిర్మించిన వీటిని రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడి వృద్ధులు నదిలో కలిసేందుకు వీల్లేకుండా పకడ్బందీగా ప్రత్యేకంగా ట్యాంకులు ఏర్పాటు చేశారు. వీటిని వాడుకలోకి తీసుకురావడంతో ఎట్టకేలకు టాయ్‌లెట్స్ ఇబ్బందులు తప్పనున్నాయి.



మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

సత్యవేడు, న్యూస్‌టుడే

సమస్య: సత్యవేడు మండలంలోని గంగలకండ్రిగ ఎస్టీ కాలనీలో రాత్రుల్లో వీధి లైట్లు వెలగడం లేదు. సమీపంలోని కోనేరు నుంచి పాములు, కప్పలు, ఎలుకలు ఇళ్లల్లోకి రావడంతో పిల్లలు భయాందోళనకు గురివుతున్నారు.

- సుబ్రహ్మణ్యం, గంగలకండ్రిగఎస్టీకాలనీ

సమాధానం: వీధి లైట్లు వెలగడం లేదని తమ దృష్టి వచ్చింది. సిబ్బందితో రెండు రోజుల్లో వీధి లైట్లు అమర్చుతాం. **- రాజ్‌కిరణ్, ఏఈ, సత్యవేడు**

న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: నాగలాపురంలోని వరశక్తి వినాయకస్వామి ఆలయం వద్ద వీధి దీపం తరచూ మరమ్మతులకు గురవుతోంది. నిత్యం జనసంచారంతో ఉండే ఈ కూడలి వద్ద దీపపు కాంతులు లేక అంధకారం అలముకుంటోంది.

- సుబ్రహ్మణ్యం, నాగలాపురం

సమాధానం: ఒక రోజు వ్యవధిలో విద్యుత్ తీగలను సరి చేయించి నూతన వీధి దీపాన్ని ఏర్పాటు చేయిస్తాం.

- చిన్నదురైసుధ, సర్పంచి, నాగలాపురం

వివేకానందకాలనీలో వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

రేణిగుంట, న్యూస్‌టుడే: పంచాయతీలోని వివేకానందకాలనీలో వీధి దీపాలు లేక పోవడంతో ఇబ్బందిగా ఉందని సోమవారం ఈనాడులో 'మేమున్నాం మీకుతోడుగా'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు ఇక్కడ చెడిపోయిన కొన్ని వీధి దీపాలను బాగు చేశారు. మరో రెండు రోజుల్లో మిగిలిన వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

గ్రామీణాభివృద్ధికి శ్రీకారం

ఏర్పేడు, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గురువారెడ్డి తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఇసుకతాగేలిలో సోమవారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. హంస, గురవమ్మ, రాచేటి సుబ్రహ్మణ్యం, కుమార్, మునిరామిరెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు) : అనుమానాస్పదంగా గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని అరవకొత్తూరు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ రవినాయక్ కథనం మేరకు.. గుర్తుతెలియని మృతదేహం(30) ఉన్నట్లు స్థానికులు సోమవారం సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించామన్నారు. తలపై గాయం ఉండటంతో పాటు మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో కేసు నమోదు చేసి పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అయితే హత్య, ఆత్మహత్య, బయట ప్రాంతాల నుంచి మృత దేహాన్ని తీసుకొచ్చి ఇక్కడ పడవేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టాభూమిలో దౌర్జన్యంగా శవం పూడ్చివేత

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పట్టాభూమిలో అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యంగా శవాన్ని పూడ్చివేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మల్లికార్జున్ కథనం మేరకు.. సత్యవేడు మండలం ఇరుగొళంనకు చెందిన జయశంకర్‌రెడ్డి మండలంలోని యానాదివెట్టులో సర్వేనెం.58/26 వగైరాలలో దాదాపు పది ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిలో మామిడి చెట్లు నాటి చుట్టూ కంచె వేశారు. ఇటీవలే ఆ భూమిని వ్యవసాయేతర భూమిగా అధికారులు మార్పు చేశారు. ఇదిలాఉండగా ఈ నెల 15వ తేదీన యానాదివెట్టు ఎస్సీకాలనీకి చెందిన రాజారామ్ తన తండ్రి సుబ్రహ్మణ్యం చనిపోవడంతో ఆయన మృతదేహాన్ని జయప్రకాష్‌రెడ్డి స్థలంలో కంచెను ధ్వంసం చేసి దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించి అక్కడే శవాన్ని ఖననం చేశారు. అడ్డుకోవడానికి యత్నించిన జయశంకర్‌రెడ్డిపై రాజారామ్‌తో పాటు, అతని బంధువులు మస్తానయ్య, దిలీప్, గజేంద్రుడు, గంగాధరంలు దాడి చేయడంతో, బాధితుడు ఈ విషయమై గ్రామపెద్దలను ఆశ్రయించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన గ్రామపెద్దలు పట్టించుకోక పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున్ తెలిపారు.

గూడూరు
• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం:
కేజీ రూ. 60 నుంచి
రూ. 80 వరకు

రెండో రకం:
కిలో రూ. 50 నుంచి
రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	132
లేయర్	115
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	195

నేడు ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్థికంగా ఎదగాలి

గూడూరు పట్టణం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని మెప్మా సీఎంఎం పెంచలయ్య తెలిపారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మెప్మా మార్కెట్ ఏర్పాటు చేసి, చీరలు, వివిధ రకాల వస్తువులు సోమవారం విక్రయించారు.

న్యాయవాదుల నిరసన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఓ న్యాయవాది పట్ల ఎస్సై బ్రహ్మనాయుడు దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ మంగళవారం విధులను బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదుల సంఘం పేర్కొంది. ఈ మేరకు సోమవారం న్యాయవాదుల సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై బ్రహ్మనాయుడు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ న్యాయవాదుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే:

సమస్య: కోట మండలంలోని గూడలి రోడ్డులో వేగ నియంత్రికలు లేకపోవడంతో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. - గణేశ్, విద్యార్థి

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - ర.భ అధికారి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరు పట్టణం సాదుపేట ప్రాంతంలో డ్రైనేజీ కాలువలో మురుగునీరు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - మురళి, గూడూరు

సమాధానం: కాలువల్లో పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. మురుగునీరు వెళ్లేలా కాలువలను పునరుద్ధరిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. - వెంకటేశ్వర్లు, పుర కమిషనర్

వీధి దీపాల ఏర్పాటు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మాళ వ్యాసగిరి ప్రాంతంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ నెల 18న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

కాలువ శుభ్రం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: జనార్దన్ పేట ప్రాంతంలో డ్రైనేజీ కాలువలో సక్రమంగా మురుగునీరు కదలకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయమై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా కాలువను శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

● ఉపాధి నిధుల కేటాయింపు ● రూ.8.63 కోట్లతో అభివృద్ధి పనులు



కోట: సిద్ధమ్మకండ్రిగలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా తయారైంది. ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టలేదు. కేంద్రం కేటాయించిన నిధులను సైతం ఇష్టానుసారంగా పక్కదారి మళ్లించారు. సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామీణ వృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. 'పల్లె పండుగ' పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఉపాధి హమీ నిధులతో ఒక్కొక్క గ్రామానికి రూ.10 లక్షలు చొప్పున సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నారు.

గూడూరు నియోజకవర్గంలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు ఉండగా 113పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటిలో సుమారు రూ.8.63 కోట్లతో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, గ్రావెల్ రహదారులు ఏర్పాటుకి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, పనులు చేసేందుకు నిధులు కేటాయించారు. పంచాయతీల అభివృద్ధిలో ఆయా శాఖల అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఉపాధి పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేలా స్థానిక ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

మండలం	మొత్తం పంచాయతీలు	మంజూరైన పనులు	వ్యయం (రూ.కోట్లలో)
గూడూరు	19	27	1.36
చిల్లకూరు	31	35	1.73
కోట	21	37	1.77
వాకాడు	19	42	1.77
చిట్టమూరు	23	45	2.00

త్వరితగతిన పూర్తి చేస్తాం

పంచాయతీల్లో ప్రతిపాదించిన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంతాల్లో చేయాల్సిన పనులు గుర్తించి కూటమి ప్రభుత్వం ఉపాధి హమీ నిధులతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. పనులు త్వరగా ప్రారంభించేలా కృషి చేస్తాం.

- డి.రవీంద్రబాబు, పంచాయతీ రాజ్ ఈఈ, గూడూరు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పాఠశాల డీన్లు, ఉపాధ్యాయులు



పరీక్ష రాస్తున్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభకు పదును

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం ప్రతిభ పాఠవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్‌నెట్ వల్ల కలిగే లాభ, నష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎం.సహస్ర, సీహెచ్ లౌక్య, సీహెచ్ గౌతమ్‌రామన్ గెలుపొందారు. కార్యక్రమంలో పాఠశాల డీన్‌లు హరిబ్రహ్మయాదవ్, శ్రీహరిబాబు, గాంధీ, ఉపాధ్యాయులు కల్యాణి, ప్రత్యూష, లావణ్య పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిరసన..

గూడూరు పట్టణం: భూమి కౌలుకిస్తే భూమి నాదే అంటూ మహిళపై దౌర్జన్యం చేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత మహిళ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కోట మండలం రుద్రవరానికి చెందిన జమీల తన భూమిని ఫయాజ్‌కు కౌలుకి ఇచ్చారు. కొన్నేళ్లుగా సాగు చేస్తున్న ఫయాజ్ భూమి తనదే అంటున్నాడని పేర్కొన్నారు. న్యాయం చేయాలని కోరారు.



అమరవీరులు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సహాయ కమాండెంట్

పోలీసుల త్యాగాలు మరువలేనివి

వెంకటగిరి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని ఏపీ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఇన్‌ఛార్జి కమాండెంట్ అరుణ్‌బోస్ అన్నారు. మండలంలోని వల్లివేడులోని ఏపీ పోలీస్ 9వ పటాలంలో సోమవారం 'అమరవీరుల సంస్కరణ దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని సీఐ వెంకటరమణ, ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చిల్లకూరు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు పాలిచర్లవారిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌బాల్, త్రోబాల్ పోటీల్లో జిల్లాస్థాయిలో పాల్గొన్న విద్యార్థినులు నవ్యశ్రీ, గౌసియా, తరుణి, నిష, ఝాన్సీ, ప్రవళిక ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు విన్నవించారు. అర్జీలు పరిశీలించి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం



పెళ్లకూరు: శంకుస్థాపన చేస్తున్న విజయశ్రీ, సుబ్రహ్మణ్యం

కోట, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. కోట మండలంలోని సిద్ధమ్మకండ్రిగలో సోమవారం 'పల్లె పండుగ'లో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సిద్ధవరంలో రూ.4.80లక్షలతో సిమెంట్ రోడ్డు, చిట్టేడులోని జీవీఆర్ కర్మాగారం సహకారంతో నిర్మించనున్న ఆర్వో ప్లాంట్‌కు, కేశవరం ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి సిద్ధవరం వరకు పైపులైనుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. **చిల్లకూరు :** మండలంలోని కాకువారిపాలెం, బల్లవోలు, తిక్కవరం, ముత్యాలపాడు గ్రామాల్లో ఉపాధి పథకం నిధులను వెచ్చించి చేపట్టనున్న సిమెంటు రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. **పెళ్లకూరు:** శిరసనంబేడు, చెంబేడు, సీఎన్‌పేట తదితర గ్రామాల్లో రూ.1.95 కోట్ల పనులకు ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యం, జనసేన కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. **దొరవారిసత్రం:** మినమనమూడి, శ్రీధనమల్లి, తొగరాముడి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం భూమిపూజ చేశారు. **నాయుడుపేట:** ఓజిలి మండలం పున్నేపల్లి, నెమళ్లపూడి, కర్రబల్లవోలు గ్రామాల్లో రూ.18లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోమవారం భూమిపూజ చేశారు.

చెరువుమిట్టలో ఉపాధ్యాయుడి నియామకం

ఈనాడు కథనానికి స్పందన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని చెరువు మిట్ట ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుడిని నియమించారు. ఇక్కడి పాఠశాలలో ఐదు నెలలుగా ఉపాధ్యాయుడు లేరు. సీఆర్‌ఎంటీని నియమించి విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు. ఈ విషయమై 'ఈనాడు'లో 'ఉపాధ్యాయుడు లేని పాఠశాల' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంఈవోలు కె.శ్రీనివాసులు, శీనయ్య మండలంలోని సామంతుమల్లాం పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై సోమవారం నియమించారు.



అక్రమ కేసులు తొలగించాలి

బాలాయపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగులపై వైకాపా ప్రభుత్వం పెట్టిన కేసులను తొలగించాలని కోరుతూ ఏపీ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) రాష్ట్ర కౌన్సిలర్ తాళ్లూరు శ్రీనివాసులునాయుడు సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. అమరావతిలోని సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రిని కలిసి విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు. తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ పాల్గొన్నారు.

క్రీడాకారుడు గణేశ్‌కు శాప్ ఛైర్మన్ అభినందన



గణేశ్‌ను అభినందిస్తున్న రవినాయుడు

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఇటీవల చైనాలో జరిగిన అంతర్జాతీయ విలు విద్య పోటీల్లో భారత్ తరపున పాల్గొని రెండు పసడి పతకాలు కైవసం చేసుకున్న నాయుడుపేట చెందిన గణేశ్ మణిరత్నంను శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు, తిరుపతి పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు నరసింహయాదవ్ ఆదివారం సన్మానించి అభినందనలు తెలిపారు.

పరిశోధనలతో ఉపాధి అవకాశాలు మెండు

కోట, న్యూస్‌టుడే: రోబోటిక్స్ పరిశోధనలతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని. . అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ పొందాలని బెంగళూరుకు చెందిన డైప్యాక్టో కంపెనీ నిపుణులు నందగోపాల్, ప్రొ.మీత్‌కుమార్‌పాత్ర పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం 'రోబోట్ కంట్రోల్ అండ్ ప్రోగ్రామింగ్'పై ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, కంపెనీ నిపుణులు ప్రారంభించారు. విభాగాధిపతులు విక్రమ్‌కుమార్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ.. అద్దంకి : సూళ్లూరుపేటకు చెందిన బోడిపాక దయమ్మ అద్దంకి ఎల్ఈఎఫ్ నగర్ వద్ద నివసించే ఆమె అక్క కుమారుడు సువర్ణరాజు ఇంటికి సోమవారం వెళ్లారు. రామాటాకీస్ బజారులో రూ.1.50 లక్షల విలువైన మూడు సవర్ల బంగారం కొనుగోలు చేశారు. బంగారం సంచితో ఒంగోలు బస్సు ఎక్కారు. ఆ క్రమంలో ఇద్దరు అపరిచిత మహిళలు బ్లేడుతో సంచిని కోసి బంగారు గొలుసు అపహరించినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

భూముల పరిశీలన



భూముల మ్యాపును పరిశీలిస్తున్న సెంట్రల్ కామర్స్, ఇండస్ట్రియల్ డిప్యూటీ కార్యదర్శి రాజేష్‌ఆసాతి

వాకాడు(కోట), న్యూస్‌టుడే: వాకాడు మండలం దుగరాజపట్నం, తూపిలిపాళెంలో సోమవారం సెంట్రల్ కామర్స్, ఇండస్ట్రియల్ డిప్యూటీ కార్యదర్శి రాజేష్‌ఆసాతి ఉప్పు భూములు, పోర్టుకు సంబంధించిన భూములను పరిశీలించారు. తహసీల్దారు రామయ్య, రెవెన్యూ సిబ్బంది, సర్వేయరు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు.. డచిట్టమూరు, న్యూస్‌టుడే: కొత్తగుంట వద్ద ర.భ రహదారిపై ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బురదగాలి కొత్తపాళెం గ్రామానికి చెందిన మురళీ, గొల్లపాళెంకి చెందిన గగ్గయ్య తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు.. తడ : కారూరుకు చెందిన కావేరి అముద, నాగేష్ దంపతుల కుమార్తె స్నేహ(22) ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు తడ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన స్నేహ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు తడ ఎస్సై కొండప నాయుడు తెలిపారు.

గాయపడ్డ వృద్ధురాలి మృతి.. తడ, న్యూస్‌టుడే: చిన్నమాంబట్టుకు చెందిన భువనగిరి శాంతమ్మ(79) ఈ నెల 5న వేడి నీళ్లు కాచుకునేందుకు ఆరు బయట ఉన్న పొయ్యి దగ్గర ఉండగా.. ఒక్కసారిగా మంటలు పెరగడంతో ఆమె చీరకు నిప్పంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పారు. తీవ్రంగా గాయపడిన ఆమెకు సూళ్లూరుపేటలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండప నాయుడు తెలిపారు.

మహిళపై యువకుడి దాడి.. పెళ్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరు ఎస్సీ కాలనీకి చెందిన మెరుం గీతపై అదే గ్రామానికి చెందిన నాగార్జున దాడి చేశాడు. బీసీ కాలనీలో ఆదివారం రాత్రి రోడ్డుపై వెళ్తుండగా నాగార్జున దూషించాడని బాధితురాలు సోమవారం పోలీసులు ఫిర్యాదు చేశారు.



వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో ఆదాయం

సత్యవేడు, న్యూస్‌టుడే: రైతులు పూల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. వీటిల్లో బంతి పూలు ముఖ్యమైనవి. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పండుగ సీజన్ కావడంతో రైతులు ఆదాయాలను పొందుతున్నారు. తండ్రి వ్యవసాయదారుడు కావడంతో చిన్నతనం నుంచి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నాడు వెంకటరాజులకండ్రిగ గ్రామానికి చెందిన రుషి. అతి తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వాణిజ్య పంటలపై మక్కువ పెంచుకుని బంతిపూలను సాగు చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం హోసూరు తెప్పించిన నారు మంచి దిగుబడి ఇవ్వడంతో అధిక దిగుబడులు పొందుతున్నాడు.

చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు..

ఎకరంలో బంతిపూల సాగుకు సుమారు ఆరు వేల మొక్కలు వరకు అవసరం ఉంటుంది. తెగుళ్లు, పురుగులు ఆశించకుండా మొక్కకి మొక్కకి మధ్య అడుగు, సాలుకు సాలు మధ్య రెండు అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొదట్లో వేపపిండి, 16-20-0-13 బలం వినియోగించారు. మొక్కలను చీడ పీడలు ఆశించకుండా మూడు రోజులకు ఒకసారి మందులు పిచికారీ చేయాలి. 20రోజుల తర్వాత డీఏపీ, మోనో క్రోటోపాస్ వినియోగిస్తున్నారు. అప్పుడప్పుడు సేంద్రియ ఎరువులు సాళ్లలో వాడుతున్నారు.

అదును పదును చూసి సాగు

బంతి పూల సాగు లాభసాటిగా మారి ఎకరం భూమిలో కేవలం రూ.30వేల పెట్టుబడితో లక్ష వరకు ఆదాయాన్ని పొందవచ్చు. ఎకరం బంతి పూల సాగులో రెండు నుంచి మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతులు అదును పదును చూసి సాగు చేసుకుంటే సిరులు పొందవచ్చు.

- రుషి, రైతు, వెంకటరాజులకండ్రిగ, సత్యవేడు

మార్కెట్ సౌకర్యం..

బంతి నాటిన 45రోజుల నుంచి పూలు కోతకు వస్తాయి. రోజు మార్చి రోజు కోయాల్సి ఉంది. పువ్వులకు ముందే నీరు అందించినట్లయితే తాజాగాను, విప్పుకున్న పువ్వులే కోస్తే ఎక్కువ బరువు వస్తాయి. పువ్వులను తమిళనాడులోని కోయంబేడు మార్కెట్, గుమ్మిడిపూండి, మాదరపాకం, సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాలకు తరలించి అధిక లాభాలు పొందుతున్నారు.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సూచనలను చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: రబీలో వరి పంటకు ఎరువులు ఎన్నిసార్లు ఎంత మోతాదులో వేసుకోవాలి?

- చంద్రయ్య, రైతు, వెంకటాపురం

జవాబు: రబీ కాలంలో 48 కిలోల నత్రజని, 24 కిలోల ఫాస్పరస్, 16 కిలోల పొటాషియం, 20 కిలోల జింక్ సల్ఫేట్ ఒక ఎకరానికి ఒకేసారి వేసుకోవాలి.

విన్నవిస్తున్నా పట్టించుకోరేమయ్యా..!

కలెక్టరేట్‌లో అర్జీదారుల ఆవేదన

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు వినతులిస్తున్నా న్యాయం జరగడం లేదు.. కనీసం తమ వినతులను పరిశీలించినట్లు కనిపించడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి అధికారులకు వినతులు ఇచ్చారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఇంటి స్థలంపై ఇతరులకు హక్కు



పుత్తూరు సత్యనారాయణ కాలనీలో నాకు ఇంటి స్థలం ఉంది. గత ప్రభుత్వంలో ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. కుటుంబం వీధిన పడింది. అధికారులు ఆ భూమిపై వారికి హక్కులు కల్పించారు. మండల రెవెన్యూ అధికారులను కలిసి విన్నవించినా న్యాయం జరగలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-నాగరాజు, గోవిందపాళ్యం

రహదారి స్థలం ఆక్రమించారు



పాకాల మండలం పరిధిలోని గుంత గాండంకిలో రహదారి స్థలాన్ని ఆక్రమించుకున్నారు. సర్వే నం.378/1లో నాకు వ్యవసాయ భూమి ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు పొలాలకు వెళ్లే రహదారిని ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారు. అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. ప్రభుత్వం, అధికారులు మారినప్పటికీ రహదారిపై నిర్మించిన ప్రహరీని మాత్రం తొలగించలేదు. దీనివల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. **-సి.రూపకుమార్, గుంత గాండంకి**

● కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 193 వినతులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం భన్సల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులుతో కలిసి కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 131 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రైతేరాజు

కూరగాయల పంటలు కాపాడుకుందాం



పుత్తూరు, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూరగాయల పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు ఉద్యానాధికారిణి వెంకటసౌజన్య సూచించారు.

❖ వాలిపోయిన మొక్కలను నిలబెట్టాలి. ❖ ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. ❖ నారుమళ్లు తెగులు ఆశించకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి నారు మళ్లను ముందుగా మందు ద్రావణంతో బాగా తడపాలి. ❖ మొక్కలు తేరుకున్న తర్వాత సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములతో పాటు సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5గ్రాముల లీటరు నీటిలో కలిపి ఒకదాని తర్వాత మరొకటి వారం రోజుల వ్యవధిలో 2-3సార్లు పిచికారీ చేయాలి. ❖ వేరుకుళ్లు ఆశించిన తోటల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 20 గ్రాములు లేదా కార్బండిజమ్ 10 గ్రాములు చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి. గొంగళి పురుగులు ఆశిస్తే నివారణకు క్లోరిఫైరిపాస్ 2.5గ్రాములు లేదా నొవాల్యురాన్ 0.15మి.లీ వంటి కీటకనాశిని మందులను లీటరు నీరు చొప్పున పిచికారీ చేస్తే అదుపు చేయవచ్చు.



పాల ధరలు పెంచుకోవడం ఇలా..

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పశుపోషకులు పాల ధరలు పెంచుకోవడంపై అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే ఆశించిన మేరకు పాల ఉత్పత్తులను పెంచుకోవడంతో పాటు ఆర్థికంగా లాభాలు పొందే అవకాశముంది.

◗ పాలల్లో వెన్న, ఘన పదార్థాల శాతం (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్) పెరగాలంటే పాడి పశువులకు రోజూ పాలకంకుల దశలో కోసిన 20 నుంచి 30 కిలోల పచ్చి మేతతో పాటు కచ్చితంగా 8 కిలోల ఎండు మేతను చిన్న ముక్కలుగా ఇవ్వాలి. ◗ ప్రతి రోజూ పాలు పితికే సమయం, వ్యక్తి, విధానం ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ◗ పశువుకు పాలు పితికే ఒక గంట ముందు నీటిని తాపరాదు. ◗ బీరు పొట్టు, పాలబడి పిండి, మొక్కజొన్న పిండి, మిగిలిపోయిన అన్నం ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆమ్ల అజీర్తి చేసి పశువులు అనారోగ్యానికి గురికావడంతో పాటు పాల ఉత్పత్తి, ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ తగ్గిపోతుంది. తద్వారా ధర తగ్గిపోయే అవకాశముంది. ◗ మేతతో పాటు రోజూ ప్రతి మూడు లీటర్ల పాలకు ఒక కిలో దాణా, పూటకు 50 గ్రాముల మినరల్ మిక్చర్ (ఖనిజ లవణ మిశ్రమం) ఇవ్వడం వల్ల ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెరుగుతుంది. ◗ పాలు పితికే సమయంలో పొదుగును సున్నితంగా రుద్దడం ద్వారా పాల దిగుబడి పెంచుకునేందుకు వీలుంటుంది. ◗ పాలను ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ తక్కువగా వచ్చే పశువులకు రోజూ వంట సోడా 120 నుంచి 240 గ్రాములు మూడు రోజుల పాటు తినిపించడం వల్ల పెంచుకునే వీలుంటుంది. ◗ పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పితికిన వెంటనే శుభ్రంగా నీటితో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ◗ పాలు పితికిన వెంటనే 15 నిమిషాల పాటు పడుకోకుండా పచ్చిదాణా తినిపించాలి. దీంతో పొదుగువాపు రాకుండా నివారించవచ్చు.

- ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, శ్రీకాళహస్తి

శాంతిభద్రతలకు దిక్సూచి పోలీసులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, వేదికపై ఎస్పీ సుబ్బరాయుడు, పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: దేశ సరిహద్దుల నుంచి ఇంటి హద్దుల వరకు శాంతిభద్రతల పరిరక్షణకు దిక్సూచి పోలీసులని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ కవాతు మైదానంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అక్కడి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. జిల్లాలో అమరులైన ఎనిమిది మంది పోలీసుల కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. దేశవ్యాప్తంగా అమరులైన 216 మంది పోలీసుల పేర్లు చదువుతూ స్మరించుకున్నారు. కలెక్టర్, ఎస్పీ సుబ్బరాయుడు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

కుటుంబాలకు సన్మానం: జిల్లాలో అమరులైన ఎస్ఐ రెడ్డినాయక్, ఏఎస్ఐ యువరాజులు నాయుడు, హెచ్‌సీ చలపతిరాజు, ఇలియాస్, శ్రీధర్‌బాబు, నాగరాజ, కానిస్టేబుళ్లు విద్యాసాగర్, అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను కలెక్టర్, ఎస్పీ పరామర్శించారు.

స్పృహ తప్పిన కానిస్టేబుల్: పరేడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ అలసటకు గురై స్పృహ తప్పి పడిపోయారు. సహచరులు సపర్యలు చేస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కలెక్టర్.. కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ నాడిని పరిశీలించారు. అనంతరం పోలీసు వాహనంలో స్విమ్స్‌కు తరలించగా కోలుకుంటున్నారు.

చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో భక్తులు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన నగదు, ఇతర సొమ్ములను సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు లెక్కించారు. 116 రోజులకుగాను రూ.67,98,889 రాబడి వచ్చిందని ఈవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. యూఎస్‌ఏ డాలర్లు 131, యూఏఈ దిరహమ్స్ 160, సౌదీ రియాల్స్ 7, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, సింగపూర్ డాలర్ 30, ఆస్ట్రేలియా 20, కువైట్ 1/4 దీనార్, ఫేం హున్డ్రెక్రొనర్ 300, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 100, యూరో 5 వచ్చాయని ఆమె వివరించారు.



◗ ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ◗ ఎదుట జస్టిస్ వేలుమణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ◗ శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

టెట్‌కు 1,299 మంది హాజరు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సోమవారం మూడు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 1,299 మంది హాజరయ్యారు. జిల్లాలోని 9 కేంద్రాల్లో ఈ నెల మూడో తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కాగా సోమవారంతో ముగిశాయి.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు(జిల్లా పంచాయతీ): మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారన్నారు. అర్హులైన వారు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ప్రిన్సిపాళ్ల ద్వారా ఈనెల 25వ తేదీ లోగా విజయవాడ, భవానీపురం, హెచ్‌బీకాలనీ, మాలవిక విల్లా, 76-1-6ఎ/1, 2 చిరునామాకు పంపాలని ఆయన కోరారు.

అసైన్డ్ భూ దస్త్రాల పరిశీలన

బాలాయపల్లి, న్యూస్‌టుడే: 2003కు ముందు ఇచ్చిన అసైన్డ్ భూములకు సంబంధించి హక్కులు కల్పించేందుకు గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన భూ వివరాలపై తుడా భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ సుజన సోమవారం పరిశీలించారు. 27 గ్రామాల్లోని 2,388 మందికి చెందిన 2,085 ఎకరాలకు భూ హక్కులు కల్పించడానికి అప్పట్లో నివేదికలు పంపారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్‌తో పాటు సిబ్బంది భూముల వివరాలపై ఆరా తీశారు.

తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు స్వీకరించాలి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించి వీఐపీ బ్రేక్ దర్శనాలను జారీచేయాలని తెలంగాణ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బాలమూరి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని వీరు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఇటీవల తితిదే డయల్ యువర్ ఈవోలో.. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరించడం లేదని ఈవో తెలిపారని, ఇది చాలా బాధాకరమన్నారు.



శ్రీవారి ఆలయం ఎదుట తెలంగాణ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బాలమూరి వెంకట్

రాజగోపాల్‌నాయుడుకి ఘన నివాళి



రాజగోపాల్‌నాయుడుకి నివాళి అర్పిస్తున్న గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి తదితరులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని దిగువమాఘంలోని రాజన్న మెమోరియల్ పార్క్‌లో నిర్వహించారు. అమరరాజా గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమాదేవి.. రాజగోపాల్‌నాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోపీ, మాజీ సర్పంచి కుమార్‌నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్ళపల్లి, యల్లంపల్లి సురేష్, గల్లా అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శన టికెట్ల విక్రయంపై దర్యాప్తు ముమ్మరం

తిరుమల: శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన కేసులో తిరుమల వన్‌టౌన్ పీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బెంగళూరు భక్తుడిని మోసగించిన కేసులో ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా వైకాపా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా ఎమ్మెల్సీ పీఆర్వో కృష్ణతేజ పేర్లు చేర్చిన విషయం తెలిసిందే. ఈ కేసును గోప్యంగా విచారిస్తున్న పోలీసులు గతంలో నిందితుల మధ్య లావాదేవీల వివరాలను సేకరిస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ వ్యవహారం జరుగుతుందో దానిపై దృష్టిసారించారు. ఈ వ్యవహారంలో బయట వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తితిదే ఉన్నతాధికారులు కూడా దీనిపై దృష్టిసారించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	142
లేయర్	115
బ్రాయిలర్స్	206
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	234
లేయర్ మాంసం	195

ఎస్వీయూ అంతర కళాశాలల క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర జిల్లాల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియం వేదికగా మొదటి రోజు సోమవారం కబడ్డీ, తైక్వాండో పోటీలు జరిగాయి. పోటీలకు ఎస్వీయూ అనుబంధ కళాశాలలకు చెందిన 25 కళాశాలలకు చెందిన జట్లు తరలివచ్చాయి. పోటీలను ఆ వర్సిటీ వ్యాయామ విద్యావిభాగం అధిపతి ఎం.శివశంకర్ రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు ప్రారంభించారు. కబడ్డీ తుదిపోరులో తిరుపతి బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విజేతగా, తిరుపతి ఎస్వీయూ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ట్రోఫీ, ధ్రువపత్రాలను ప్రదానం చేశారు.



తిరుపతి బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విన్నర్ జట్టు

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. ఆదివారం శ్రీవారిని 73,926 మంది దర్శించుకున్నారు. రూ.3.87 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

బిల్లు రీడింగ్ కాంట్రాక్ట్ అప్పగింత

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లుల రీడింగ్ కాంట్రాక్టును విజయవాడ చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సంస్థకు రెండేళ్ల కాంట్రాక్టు పద్ధతిపై విద్యుత్ బిల్లులు రీడింగ్ చేసే బాధ్యతను అప్పగించారు. వచ్చే నెల ఒకటి నుంచి ఆ సంస్థ రీడింగ్ పనులు ప్రారంభించనుంది.

హెచ్చరిక.. లెక్కచేయక

హెచ్చరికల బోర్డు పెట్టి గుర్తుచేసినా కూడా 'అయితే మాకేంటి' అన్నట్లుంది తిరుపతిలో వాహనదారుల తీరు. శ్రీనివాస సేతు మీదుగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ లోపలికి ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. ఇతర వాహనాలు ఆ మార్గంలో వెళ్తే రూ.1000 వరకు జరిమానా విధిస్తామని బారికేడ్లు పెట్టి హెచ్చరించినా ఖాతరు చేయడం లేదు. ఈ ఒక్కసారికి ఏం కాదులే అంటూ నిర్లక్ష్యంగా వెళ్తున్నారు.

- ఈనాడు డిజిటల్, తిరుపతి



సైకిల్‌పై బెంగళూరు టు కాశీ

సైకిల్ యాత్రతో అవధులు లేని ఆనందాన్ని పొందుతున్న ఈయన పేరు ముత్తుకుమార్. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు సైక్లింగ్ యాత్ర చేసినట్లు తెలిపారు. మొదట చెన్నై-కాశీ, రెండోసారి రామేశ్వరం-కాశీ, మూడోసారి బెంగళూరు-కాశీక్షేత్రంకు వెళ్లి వస్తూ తిరుపతి పద్మావతిపురం వద్ద కన్పించారు. బెంగళూరులో ఎలక్ట్రీషన్‌గా పని చేశానని.. పిల్లలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారని చెప్పారు. శ్రీవారి దర్శనానంతరం కాణిపాక వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుని బెంగళూరు వెళ్లనున్నారు. సైకిల్‌పై వివిధ రాష్ట్రాలు తిరగడం.. కొత్త వ్యక్తులతో మాట్లాడటం ఆనందంగా ఉందంటున్నారు ఈ 58 సంవత్సరాల సైక్లిస్టు.

- ఈనాడు, తిరుపతి



తితిదే ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా గంగరాజు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా గంగరాజును నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు పలువురి బదిలీ, పదోన్నతులపై ఉత్తర్వులిచ్చారు. ఇప్పటి వరకు తితిదే ఎస్పీఎఫ్ కమాండెంట్‌గా పనిచేస్తున్న సత్యంనాయుడు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పదోన్నతిపై గంగరాజు నియమితులయ్యారు.

ఎన్నికల బరిలో 35 మంది

తిరుపతి(బైరాగిపట్టెడ): తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 35 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలారు. మొత్తం 43 మంది అభ్యర్థులు తొలుత డైరెక్టర్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిది మంది ఉపసంహరించుకోవడంతో 35 మంది మిగిలారు. వీరందరికీ ఎన్నికల అధికారి ఉమాపతి గుర్తులు కేటాయించారు. అభ్యర్థులందరూ తమ గుర్తులతో ప్రచారాన్ని తీవ్రం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి తెలిపారు. సోమవారం స్థానిక సీఆర్వో ఎదురుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునికీకరించిన 12 ట్రాఫిక్ నియంత్రణ ద్విచక్ర వాహనాలను అదనపు ఈవో జెండా ఊపి ప్రారంభించారు. ఈవో మాట్లాడుతూ.. తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని తెలిపారు. తిరుమల ప్రాంతాన్ని ఐదు ట్రాఫిక్ జోన్లుగా విభజించి ట్రాఫిక్ జామ్ జరగకుండా, నో పార్కింగ్‌లో వాహనాలను ఉంచకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఏఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు హరిప్రసాద్, విజయ్‌కుమార్, శ్రీరాముడు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమలలో ద్విచక్రవాహనాలను ప్రారంభిస్తున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు

తిరుపతిలో క్రమబద్ధీకరణకు చర్యలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆధునికీకరించిన 17 ద్విచక్ర వాహనాలను ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే తిరుపతిలో ఉన్న 17 ద్విచక్ర వాహనాలకు అదనంగా జీపీఎస్ సిస్టమ్, సైరన్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, ఫ్లాష్ లైట్, బ్రీత్ అనలైజర్, అత్యాధునిక టెక్నాలజీతో ఆధునికీకరించి పునఃప్రారంభించామని చెప్పారు. నగరాన్ని ఏడు సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్‌కు వీటిని కేటాయించామన్నారు. ఏఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, డీఎస్పీ గిరిధర్, సీఐలు రవీంద్ర, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.